
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5 మంగళవారం 14 అక్టోబరు 2025
గరిష్ఠం 29.0
కనిష్ఠం 21.0



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.70 (311.1486)	68,397	68,397
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.40 (4.30)	1,711.21	1,711.21
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.029 (42.7687)	82,692	82,092

చికెన్ ధరలు | లైవ్ : రూ.130 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.220



ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

మద్యంపై ఎమ్మెల్యే సమరం

- మద్యం టెండర్ల వేళ విచ్చలవిడికి అడ్డుకట్ట వేసే ప్రయత్నం
- దుకాణాలను సాయంత్రం 4 నుంచి 8గంటల వరకే నడపాలని సూచనలు
- ఎమ్మెల్యే సూచనలతో ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రాన్ని అందజేసిన కాంగ్రెస్ నేతలు

నల్లగొండ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మద్యం టెండర్ల వేళ మునుగోడు నియోజకవర్గం మరోసారి రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. నియోజకవర్గంలో మద్యం దుకాణాల నిర్వహణకు ప్రజల తరఫున షరతులు విధిస్తామని, వీటిని పాటించేవారే టెండర్లలో పాల్గొనాలని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సూచించారు. ఎమ్మెల్యే సూచనలు అమలు చేసేందుకు ఎక్సైజ్ అధికారులు సహకరించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు, ఆయన అనుచరులు ఎక్సైజ్‌శాఖ జిల్లా అధికారికి వినతిపత్రం అందజేశారు. ఏడాదిన్నర నుంచి నియోజకవర్గంలో బెల్ట్ దుకాణాలను నియంత్రించే చర్యలు చేపట్టారు. మద్యం దుకాణాలకు టెండర్లు నడుస్తున్న సందర్భంలో ఇప్పటి నుంచే కట్టుదిట్టమైన నియంత్రణకు చర్యలు తీసుకోవాలనే ఉద్దేశంతో షరతులను తెరమీదకు తేవడంతో వీటి ఫలితం ఎలా ఉండనుందనే ఆసక్తి సర్వత్రా నెలకొంది.

గ్రామాల్లో సామాజికరుగ్మతగా మారిన మద్యపానం

మునుగోడు నియోజకవర్గంలో పర్యటిస్తున్న పలు సందర్భాల్లో ఎందరో యువకులు చిన్నవయసులోనే మద్యానికి బానిసై విచక్షణారహితంగా ప్రవర్తిస్తున్న విషయం తన దృష్టికి వచ్చిందని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి పలు సందర్భాల్లో ఆవేదన వ్యక్తం చేశారు. మద్యానికి బానిసై 30 ఏళ్లలోపే చనిపోతే, వారి భార్యలు చిన్నవయసులో పిల్లలను పోషించేందుకు ఎన్నో కష్టనష్టాలు పడుతున్న విషయం తననలు కలచివేసిందని పేర్కొన్నారు. గత పదేళ్లలో గ్రామాల్లో సామాజికరుగ్మతగా మద్యపానం మారిందన్నారు. కనీసం మునుగోడు నియోజకవర్గంలోనైనా ఈ పరిస్థితిని మార్చాలనే ఉద్దేశంతో తొలుత బెల్ట్‌దుకాణాల నిర్మూలనకు చర్యలు చేపట్టారు. ఇప్పుడు మద్యం విక్రయాల నియంత్రణకు కార్యాచరణ ప్రతిపాదించారు.ప్రజలను ఆరోగ్యవంతులుగా ఉంచడం, మనిషి జీవన ప్రమాణాలు పెంచడమే తన లక్ష్యమని పేర్కొంటున్న ఎమ్మెల్యే.. బెల్ట్‌షాపుల నిర్మూలన, మహిళా సాధికారత కోసమే ఈ నిర్ణయం తీసుకున్నామని, అంతేతప్ప ఎవరినీ ఇబ్బందులకు గురిచేయాలని కాదని స్పష్టం చేస్తున్నారు.

సాయంత్రం తర్వాతే మద్యం విక్రయాలు

మునుగోడు నియోజవర్గంలో మద్యం దుకాణం ఎవరికి వచ్చినా సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకే మద్యం విక్రయాలు చేయాలని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సూచిస్తున్నారు. అదేవిధంగా గ్రామాల్లో కాకుండా ఊరుబయటనే మద్యం దుకాణాలు ఏర్పాటు చేయాలని, దుకాణాల వద్ద సిట్టింగులు నిర్వహించేది లేదని, కేవలం దుకాణమే నడపాలని ప్రతిపాదించారు. అదేవిధంగా బెల్ట్‌దుకాణాలను ఎట్టి పరిస్థితుల్లో నడవనిచ్చేది లేదని హెచ్చరించారు. సిండికేట్లు ఉండవద్దని, బెల్ట్‌దుకాణాలకు మద్యం విక్రయించవద్దని సూచించారు. నల్లగొండ, యాదాద్రి జిల్లాల్లో విస్తరించిన మునుగోడు నియోజకవర్గంలో ఏడు మండలాలు, రెండు మునిసిపాలిటీలు కలిపి 29 మద్యం దుకాణాలు, నాలుగు బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయి. చౌటుప్పల్ పట్టణంలో మూడు, చండూరు పట్టణంలో ఒక బార్, చౌటుప్పల్ మండలంలో 11 మద్యం దుకాణాలు, సంస్థాన్‌నారాయణపురం

- మిగతా 8వ పేజీలో...



మునుగోడులో మద్యం దుకాణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి (ఫైల్)



ముందస్తు జాగ్రత్తే

ఔషధం

- పశువుల్లో గాలికుంటు వ్యాధి
- అలసత్వం వహిస్తే మృత్యువాత పడే ప్రమాదం
- రేపటి నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు

6

అభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ (కలెక్టరేట్), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల ప్రత్యేక అధికారులు అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. సోమవారం 'ప్రజావాణి' కార్యక్రమంలో బాధితుల నుంచి ఫిర్యాదులు తీసుకొని జిల్లా అధికారులతో పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు కేంద్రాలన్నింటినీ వెంటనే ప్రారంభించాలని, కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని, అకాల వర్షాకి ధాన్యం తడవకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక అధికారులు అన్ని కేజీబీవీలు, మోడల్ పాఠశాలలను తనిఖీ చేయాలని, మండల స్థాయిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పర్యవేక్షించాలన్నారు. పూర్వ ప్రాథమిక విద్యకు సంబంధించి విద్యార్థుల నమోదును పెంచాలని డీఈవో భిక్షపతిని ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో నిర్మిస్తున్న వికలాంగుల ధ్రువపత్రం జారీ కేంద్రం పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని డీఆర్డీవో శేఖర్‌రెడ్డిని ఆదేశించారు. సీపీఆర్‌పై వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, ఇన్‌చార్జి డీఆర్వో వై.అశోక్‌రెడ్డి, గృహ నిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి పాల్గొన్నారు.

జీవిత బీమా సౌకర్యాన్ని వినియోగించుకోవాలి

వాహనాల ద్వారా స్వల్పకాలిక పనులు నిర్వహించే వారందరూ జీవిత బీమా సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఇటీవల స్వల్పకాలిక కార్మికుల సంఖ్య పెరుగుతోందని, అమెజాన్, జొమాటో, ఫ్లిప్‌కార్ట్, తదితర సంస్థలలో వాహనాల ద్వారా పనిచేసేవారు, డెలివరీ బాయ్‌లు, డ్రైవర్లు, కార్మికులు బీమా పాలసీలో చేరాలన్నారు. ఏడాదికి రూ.20 చెల్లిస్తే బ్యాంకులు రూ.2లక్షల వరకు బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నాయన్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్లు అవగాహన కల్పించాలని, బీమా పాలసీ శిబిరాలు నిర్వహించాలని అన్నారు.

ఇసుక తవ్వకాల సమాచారం వెబ్‌సైట్‌లో

ఇసుక తవ్వకాలకు సంబంధించి వివిధ శాఖలు సమర్పించిన నివేదికలను క్రోడీకరించి వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. ఇసుక తవ్వకాలపై నీటిపారుదల, గనులు, భూగర్భ జల వనరులు, టీఎస్ ఎంఐడీసీ, అటవీ, రెవెన్యూ, ముఖ్య ప్రణాళికాధికారి శాఖలు సమర్పించిన నివేదికలను జిల్లా సమగ్ర నివేదికగా (డీఎస్ఆర్)గా మార్చి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. దీనిపై ఏవైనా సందేహాలు, సలహాలు, అభ్యంతరాలు ఉంటే ఈనెలలో 25లోగా తెలియజేయాలని కోరారు.

చి'వరి'దశలో..

నేలవాలిన ఆశలు

- పంటలను దెబ్బతీస్తున్న వానలు
- వరిని ఆశిస్తున్న పొట్టకుళ్లు తెగులు
- దిక్కుతోచని స్థితిలో రైతులు



కోతదశలో నేలవాలిన వరిపైరు

మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): వానాకాలం పంటలపై ప్రతికూల వాతావరణ పరిస్థితులు ప్రభావం చూపుతున్నాయి. జూలై మాసాంతం వరకు సాధారణంగానే నమోదైన వర్షపాతం ఆ తరువాత ఏర్పడ్డ వాతావరణ పరిస్థితుల కారణంగా వరుసగా మోతాదుకు మించి వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో చెరువులు, కుంటలు నిండుకుండను తలపిస్తూ అలుగుపోస్తుండగా, ప్రతీ నెల దాదాపు పక్షంరోజుల వరకు తెరుచుకున్న నాగార్జునసాగర్ ప్రాజెక్టు క్రస్ట్‌గేట్ల నుంచి దిగువకు కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూనే ఉంది. అయితే వరుసగా కురుస్తున్న వర్షాలు పంటలను దెబ్బతీస్తున్నాయి. ప్రధానంగా సెప్టెంబరుతోపాటు ఈ నెలలో కురుస్తున్న వర్షాలతో అధికంగా నష్టం వాటిల్లితోందని రైతులు వాపోతున్నారు.

జిల్లాలో ప్రధానంగా సాగైన వరి పంటకు వరుసగా కురుస్తున్న వర్షాలతో కొంత మేలుతోపాటు నష్టాన్ని మిగుల్చుతోందని రైతులు చెబుతున్నారు. ప్రతీ నెలలో కొద్దిరోజుల వరకు ఎండ తీవ్రత అధికంగా ఉండడం, ఆ తరువాత ఎడతెరపిలేకుండా కరుస్తున్న వర్షాలతో పైర్లు ఏపుగా పెరిగి యూరియా అవసరాన్ని కాసింత తగ్గించాయి. ఇదే దశలో వ్యవసాయ క్షేత్రాల్లో నీటినిల్వ అధికంగా ఉండడంతో పొట్టకుళ్లు తెగులు ఆశించి పైర్లు దెబ్బతింటున్నాయి. మిర్యాలగూడ డివిజన్ పరిధిలో 1,44,500 విస్తీర్ణంలో పంటలు సాగుకాగా, వరిసాగు విస్తీర్ణం 1,16,500, పత్తిసాగు 20,280 ఎకరాలుగా నమోదైంది. 7,470 ఎకరాల్లో ఉద్యాన, వాణిజ్య, కూరగాయలపంటలు సాగవుతున్నాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం వరిపైర్లు సూది పొట్టదశకు చేరుకోగా, కొన్ని ప్రాంతాల్లో ఈతపడుతున్నాయి. ఈ తరుణంలో వారం రోజులుగా క్రమేపీ కురుస్తున్న వర్షాలకు వరి కంకి సుంకురాలిపోతోంది. దీని ప్రభావంతో దిగుబడులు తగ్గడమేగాక, ధాన్యం తూకంలో తేడాలు వచ్చే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వరి చివరి దశలో..

డివిజన్ పరిధిలోని వేములపల్లి, మాడ్గులపల్లి, త్రిపురారం, నిడమనూరు, మిర్యాలగూడ మండలాల పరిధిలో వరిపైర్లు ఈతపట్టి కంకిదశలో ఉన్నాయి. వారం రోజులుగా వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా చివరి దశకు చేరిన పంటపైర్లు దెబ్బతింటున్నాయి. సోమవారం తెల్లవారుజామున కురిసిన గాలివాన ధాటికి చివరి దశకు వచ్చిన వరి పైర్లు నేలవాలిపోయాయి. దీంతో రైతులు ఆరుగాల కష్టంపై పెట్టుకున్న ఆశలు అవిరైపోతుంటే కంటనీరు చమ్మగిల్లుతోంది. డివిజన్ పరిధిలో సాగైన వరిపంటలో 101 రకం, చింట్లు, 505 రకాలు అధికంగా ఉన్నాయి. 505 రకాల వరి పైర్లు కోతదశకు చేరుకున్న తరుణంలో నేలకు వాలుపోతుండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. నేలవాలిన పైరును నూర్పిడిచేయడమంటే ఖర్చుభారం పెరగడమేగాక, దిగుబడులు సైతం తగ్గి నష్టాలు మిగులుతాయని రైతులు దిగాలు పడుతున్నారు.

ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలి



వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా వరిపైరు వేరు వ్యవస్థలో పట్టుతప్పి నేలవాలిపోతోంది. పాల కంకిదశలో నేలవాలిన పంట దిగుబడిని కాపాడుకునేందుకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. ఉప్పు నీటిని పిచికారీ చేయడంతో వరి గింజలు మొలకెత్తకుండా ఉపకరిస్తుంది. పొట్టదశలో వరి పైరుకు కార్బండిజం శాతం అధికంగా ఉన్న మందులను పిచికారీ చేస్తే లాభదాయకంగా ఉంటుంది.

● డి.సైదానాయక్, ఏడీఏ, మిర్యాలగూడ

బాధితులకు న్యాయం అందేలా చర్యలు

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ

నల్లగొండ క్రైం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకుంటున్నట్టు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 35 మంది నుంచి వినతిపత్రాలు తీసుకొని మాట్లాడారు. ఫిర్యాదులపై ఫోన్‌లో సంబంధిత అధికారులతో మాట్లాడి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతిపత్రాలు తీసుకోవాలన్నారు. సంబంధిత ఫిర్యాదుపై వేగంగా స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అన్నారు.

చీఫ్ జస్టిస్‌పై దాడి ప్రజాస్వామ్యంపై దాడినే

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగా

నల్లగొండ (కలెక్టరేట్), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి దేశ ప్రజాస్వామ్య విలువలపై దాడి అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. సోమవారం ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 7న సుప్రీం కోర్టులో సీజే జస్టిస్ బీఆర్ గవాయ్‌పై షూ విసరడం అనాగరిక చర్య అని అన్నారు. దళితుడైన సీజేపై జరిగిన ఈ దాడి ప్రజాస్వామిక వ్యవస్థను, రాజ్యాంగాన్ని అవమానపరిచే ప్రయత్నమనే అన్నారు. ఈ దాడి వెనుక ఉన్న ఆధిపత్య శక్తులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సుప్రీం కోర్టు ప్రజాస్వామిక దృక్పథం కలిగిన సీనియర్ లేదా రిటైర్డ్ న్యాయమూర్తులతో స్వతంత్ర విచారణ చేయించాలన్నారు. అలాగే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. దళితుల ఎదుగుదల జీర్ణించుకోలేని కొన్ని శక్తుల కుట్రే ఈ దాడి అని అన్నారు. అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద నరేష్‌మాదిగ, మహాజన సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర నేత జానకి రామయ్య చౌదరి, మాదిగ ఉద్యోగుల సంఘం జాతీయ నాయకులు ధైద సత్యంమాదిగ, ఎంజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గాదె రమేష్‌మాదిగ, ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్‌మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలమాదిగ, కూరపాటి కమలమ్మ, తరి ఏడుకొండలు, బొజ్జ దేవయ్య, పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

నల్లగొండ (కలెక్టరేట్), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యం కొనుగోలుకు వెంటనే ప్రభుత్వ కేంద్రాలను ప్రారంభించాలని కిసాన్‌మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడుతూ, గతం కంటే ఈ సారి రైతులు ధాన్యాన్ని ఎక్కువ శాతం పండించిన నేపథ్యంలో జిల్లాలో అధిక సంఖ్యలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ధాన్యం కొనుగోలులో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించి, మద్దతు ధర కల్పించాలన్నారు. రైతులకు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో బీజేపీ నాయకులు కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, పోతేపాక లింగస్వామి, మండలి వెంకన్న, కన్మంతరెడ్డి అశోక్‌రెడ్డి, గుండా నవీన్‌రెడ్డి, ఓంప్రకాష్, పక్కిర్ మోహన్‌రెడ్డి, పాదూరి వెంకట్‌రెడ్డి, పిండి పాపిరెడ్డి, జవ్వాది సత్యనారాయణ, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పోలోజు బిక్షమాచారి, భోగరి అనిల్‌కుమార్, ఏమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఏమిరెడ్డి భిక్షంరెడ్డి, బీపంగి జగ్జీవన్, మిర్యాల వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి



మాడ్గులపల్లిలో తడిచిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

మాడ్గులపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఐకేపీ కేంద్రంలో ధాన్యం కొనుగోలు ప్రారంభించకపోవడంతో ఆదివారం కురిసిన వర్షానికి ధాన్యం తడిసి వరద తాకిడికి కొట్టుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులను ఆదుకోవాలన్నారు.

కార్యక్రమంలో నాయకులు, రైతులు ఊర ఎల్లయ్య, దేవిరెడ్డి అశోక్‌రెడ్డి, మల్లారెడ్డి, పుల్లెంల శ్రీకర్, మన్యం భిక్షం, గవ్వ రవి, సీతారాంరెడ్డి, కాకులవరం నాని, నరేష్, కరుణాకర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆసరా పింఛన్ల పంపిణీలో

చిల్లర సాకులు

పింఛన్ పథకం డబ్బుల్లో రూ.16 కోత

లేదంటే చిల్లర తేవాలని హుకూం

6

పోలీస్ సిబ్బంది నిష్పక్షపాతంగా

వ్యవహరించాలి

- డీఐజీ ఎల్ఎస్ చౌహాన్
- గిరిజన రైతులను కొట్టిన ఘటనపై విచారణ

7

చీకటి

రహదారిలో

- జాతీయ రహదారిపై వెలగని లైట్లు
- ప్రమాదాలకు నెలవు

7

బుద్ధవనాన్ని సందర్శించిన సీడబ్ల్యూసీ డైరెక్టర్



బుద్ధుడి పాదాల వద్ద అంజలిఘటిస్తున్న ఆశిష్‌కుమార్ కుటుంబ సభ్యులు

నాగార్జునసాగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం ప్రాజెక్టును సీడబ్ల్యూసీ డైరెక్టర్ ఆశిష్ కుమార్, డిప్యూటీ డైరెక్టర్ రోహిత్‌సింగ్ సోమవారం సాయంత్రం సందర్శించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం సాయంత్రం సాగర్‌కు చేరుకున్న వారు బుద్ధవనాన్ని సందర్శించి బుద్ధుడి పాదాలకు పుష్పాంజలి ఘటించారు. అనంతరం చరిత, జాతక, ధ్యాన, స్తూప వనం, అవకాన బుద్ధ, మహాస్తూపాలను తిలకించారు. బుద్ధవనం విశేషాలను వారికి పర్యాటకశాఖ గైడ్ సత్యనారాయణ వివరించారు. వారి వెంట ఏఈలు కృష్ణయ్య, స్వర్ణ తదితరులు ఉన్నారు.

అధ్యక్ష పదవి బీసీలకే కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సైదులు గౌడ్

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధ్యక్ష పదవి బీసీలకే కేటాయించాలని ఆ పార్టీ ఓబీసీ విభాగ రాష్ట్ర నాయకుడు పోగుల సైదులుగౌడ్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకుడు ముక్కెర అంజిబాబు యాదవ్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. టీడీపీకి వెనుకబడిన వర్గాలను ప్రోత్సహించే పార్టీగా పేరుందన్నారు. తెలంగాణలో పార్టీ పగ్గాలు బీసీకి కట్టబెడితే కార్యకర్తలు ఉత్సాహంగా పనిచేస్తారన్నారు. ప్రజలే దేవుళ్లని, సమాజమే దేవాలయమని భావించే పార్టీ అధినేత చంద్రబాబు రాష్ట్ర అధ్యక్ష పదవిని బీసీలకే అప్పగిస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు. బీసీలకు ఆది నుంచి ప్రాధాన్యం ఇచ్చిన ఏకైక పార్టీ టీడీపీనేనని అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం పోరాడేందుకు తెలుగు తమ్ముళ్లు ముందుంటారని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు జయరాజు, కాంతాచారి, మురళి, పాల్గొన్నారు.

పర్యవేక్షణ అధికారులుగా ఉపాధ్యాయులు వద్దు

నల్లగొండ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల తనిఖీ నిమిత్తం ఉపాధ్యాయులతో పర్యవేక్షణ కమిటీల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం విద్యారంగానికి తిరోగమన చర్య అవుతుందని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.వెంకటేశం అన్నారు. సోమవారం జిల్లా కార్యాలయంలో మాట్లాడుతూ విద్యాబోధన చేయాల్సిన ఉపాధ్యాయులు పర్యవేక్షణ పేరుతో పాఠశాలలకు దూరంగా ఉంటే బోధన కుంటుపడుతుందన్నారు. పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్న సందర్భంలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుండగా, రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1,473మంది ఉపాధ్యాయులను పర్యవేక్షణ అధికారులుగా నియమించడం తగదన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకులు, ఏడుకొండల్, పుష్ప, జగతి, వెంకటేశ్వర్లు, ఖుర్షిద్‌మియా, అంజయ్య, పాల్గొన్నారు.

పాఠశాల బస్సుకు తప్పిన ప్రమాదం



ప్రైవేట్ స్కూల్ బస్సును ఎక్స్‌కవేటర్ సాయంతో బయటకు తీయిస్తున్న గ్రామస్థులు

మునగాల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): చెరువు కట్ట మీదుగా వెళుతున్న ప్రైవేటు పాఠశాల బస్సుకు ప్రమాదం తప్పింది. సోమవారం సూర్యాపేట జిల్లా మునగాల మండలం నేలమర్రి గ్రామం సమీపంలో ఈ సంఘటన జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. చివ్వెంల మండలం వల్లభాపురం గ్రామం సమీపంలో ఉన్న సెయింట్ పాల్స్ హైస్కూల్ బస్సు సోమవారం ఉదయం 7 గంటలకు అదే మండలం గుంజలూరు గ్రామంలో 15మంది విద్యార్థులను ఎక్కించుకుని బయలుదేరింది. మునగాల మండలం నేలమర్రిలో మరికొందరు విద్యార్థులను ఎక్కించుకునేందుకు వస్తున్న క్రమంలో గ్రామ సమీపంలో ఉన్న చెరువు కట్టపై మరో వాహనం అడ్డు వచ్చింది. దీంతో పాఠశాల బస్సును డ్రైవర్ పక్కకు తీస్తున్న క్రమంలో బస్సు రోడ్డు దిగడంతో చెరువు కట్ట మట్టి బస్సు టైర్ల కింద కుంగింది. దీంతో బస్సు చెరువు కట్టపై దిగబడి ఆగింది. దీంతో అప్రమత్తమైన బస్సు డ్రైవర్ వెంటనే విద్యార్థులను దింపే ప్రయత్నం చేశాడు. విషయం తెనుకున్న గ్రామస్థులు వెంటనే బస్సు వద్దకు చేరుకుని విద్యార్థులను బస్సు నుంచి కిందికి దింపారు. బస్సు అదుపు తప్పిందన్న సమాచారం తెలియడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగలేదని తెలియడంతో ఊపిరి పీల్చుకున్నారు. కాగా ఎక్స్‌కవేటర్ సాయంతో చెరువు కట్టపై దిగబడిన బస్సును బయటకి తీశారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

కోదాడరూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కూచిపూడి గ్రామంలో నెల రోజుల ముందే ఈనిన పంటను వివిధ కంపెనీలకు చెందిన డీలర్లు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు, డీలర్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. వ్యాపారులు, ఎరువుల డీలర్లు రైతులకు నష్టపరిహారం ఇచ్చేందుకు మొదట ససేమిరా అన్నారు. సాగు సమయంలో జాగ్రత్తలు తీసుకోక పోవడంతో ఈనడం, బెరుకులు వస్తాయని వాదించారు. దీంతో రైతులు, వ్యాపారుల మధ్య ఘర్షణ నెలకొంది. ఆగ్రహంతో వ్యాపారుల కారును రైతులు స్వాధీనం చేసుకున్నారు. వెంటనే వ్యాపారులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు చేరుకుని రైతులు, వ్యాపారులతో చర్చించారు. పూర్తిస్థాయిలో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.5 వేలు, పాక్షికంగా దెబ్బతిన్న రైతులకు ఎకరాకు రూ.2 వేల ఇచ్చేందుకు వ్యాపారులు అంగీకరించారు. అయితే వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేసిన రైతులకు మాత్రమే ఇస్తామనడంతో మళ్లీ వివాదం మొదలైంది. గ్రామంలో 100 నుంచి 150 ఎకరాల్లో పంట నష్టపోతే కొందరికే ఇవ్వడం ఏంటని నిలదీశారు. అనంతరం రైతుల నుంచి కారును పోలీసులు వ్యాపారులకు అప్పగించారు. అనంతరం వ్యాపారులు, పోలీసులు వెళ్లిపోయారు.

పెరిగిన బాలాజీనాయక్ బాధితుల సంఖ్య



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బాలాజీనాయక్ బాధితులు

పెద్దఅడిశర్లపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : అధికవడ్డీ పేరుతో ఏజెంట్లను పెట్టుకుని ప్రజల వద్ద నుంచి రూ.కోట్లు కొల్లగొట్టిన బాలాజీనాయక్ బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం వద్దిపట్ల గ్రామపంచాయతీలోని పలుగుతండాకు చెందిన బాలాజీనాయక్‌ను పోలీసులు మూడురోజుల కిందట రిమాండ్‌కు తరలించారు. అయితే పోలీసులు తడి ఆస్తులు జప్తు చేసి కోర్టు ద్వారానే న్యాయం చేస్తామని ప్రకటించడంతో బాధితులు రెండు రోజులుగా తమ వద్ద అప్పు ఇచ్చిన ఆధారాలతో గుడిపల్లి స్టేషన్‌కు క్యూ కట్టారు. రెండు రోజులుగా బాధితుల సంఖ్య అంతకంతకూ పెరుగుతూనే ఉంది. ఆదివారం 72 మంది బాలాజీనాయక్ బాధితులు ఫిర్యాదులు చేయగా, సోమవారం 112మంది బాధితులు ఫిర్యాదు చేసినట్లు గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు తెలిపారు. వీరిలో కొందరికి మాత్రమే బాలాజీ నేరుగా ప్రామిసరీ నోట్లు, ఖాళీ చెక్కులు రాసి ఇవ్వగా ఎక్కువమందికి మాత్రం ఏజెంట్లే ప్రామిసరీ నోట్లు రాసి ఇచ్చినట్లు తెలుస్తోంది. దేవరకొండ ఏఎస్పీ మౌనిక సోమవారం ఉదయం నుంచి గుడిపల్లి స్టేషన్‌లోనే ఉండి బాధితుల ఫిర్యాదుల వివరాలను పరిశీలించారు. కొందరు బాలాజీనాయక్‌పై ఫిర్యాదులు చేయగా మరికొందరు బాలాజీనాయక్ ఏజెంట్లుగా వ్యవహరించిన వారిపై ఫిర్యాదులు చేశారు. బాలాజీనాయక్ బాధితుల్లో సామాన్య ప్రజలే కాకుండా పెద్ద వ్యాపారులు, రాజకీయ నాయకులు ఉన్నట్లు సమాచారం. ఫిర్యాదులు చేస్తే సమాజంలో తమ పరువు పోతుందని, అంతేకాకుండా ఆ డబ్బులు ఎక్కడ నుంచి వచ్చాయని పోలీసులు ప్రశ్నిస్తారనే భయంతో వెనకడుగు వేస్తున్నట్లు మండలంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. బాలాజీనాయక్ ఆస్తులను పోలీసులు గుర్తించి న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మౌనిక మాట్లాడుతూ బాధితులు ఎవరూ అధైర్యపడవద్దని, ధైర్యంగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. బాలాజీనాయక్, అతడి ఏజెంట్లపై విచారణ చేపడుతున్నామని, లావాదేవీలు గురించి ఎలాంటి విషయాలు తెలిసినా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కానీ, తనకుగాని సమాచారం ఇస్తే నిజనిజాలు తేలుస్తామన్నారు.

గోవధ.. కేసు నమోదు

చౌటుప్పల్ రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం లక్కారం శివారులో గోవధ చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు. లక్కారం గ్రామానికి చెందిన ఎస్‌కే జహంగీర్, ఎస్ లింగోటం గ్రామానికి చెందిన ఎండీ మదార్‌లు లక్కారం శివారులోని గోపనబోయిన వెంకటయ్య సమీపంలో అక్రమంగా గోవధ చేశారు. రైతులు పోలీసులకు సమాచారం అందించగా సంఘటనా స్థలాన్ని పరిశీలించినట్లు సీఐ తెలిపారు. గోవధ నిర్వహిస్తున్న వ్యక్తులను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ముందస్తు జాగ్రత్తే ఔషధం



- పశువుల్లో గాలికుంటు వ్యాధి
- అలసత్వం వహిస్తే మృత్యువాత పడే ప్రమాదం
- రేపటి నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ

రైతులు ఆర్థికంగా నష్టపోకుండా ఉండేందుకు ప్రతి ఆరు నెలలకొకసారి ఉచితంగా గాలికుం టు వ్యాధి నివారణ టీకాలను పంపిణీ చేస్తారు. ఈ క్రమంలో ఈ నెల 15 నుంచి నెల రోజుల పాటు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పంపిణీకి పశు సంవర్థక శాఖ సిద్ధమైంది. అంటువ్యాధి అయిన ఈ వ్యాధిని సకాలంలో గుర్తించి నివారణ చర్యలు చేపట్టకపోతే పశువులు, వాటి పాలు తాగిన దూడలు మృత్యువాత పడే ప్రమాదముంది. ఈ వ్యాధి వైరస్ ద్వారా గాలిలో వ్యాప్తి చెందుతుంది. ఈ వ్యాధి ప్రధానంగా పశువులు, పందులు, గొర్రెలు, మేకలు వంటి గిట్టలు కలిగిన జంతువులకు సోకుతుంది.

- (ఆంధ్రజ్యోతి-తుర్కపల్లి)

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను ఈ నెల 15 నుంచి నెల రోజుల పాటు పశువులకు వేయనున్నారు. నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు ముందు జాగ్రత్త చర్యగా ఈ టీకా వేయించాలని అధికారులు రైతులకు సూచిస్తున్నారు. 2019 పశుగణన లెక్కల ప్రకారం యాదాద్రిభువనగిరి జిల్లాలో మొత్తం 1,52,200 పశుపక్ష్యాదులు ఉండగా ఇందులో 54,868 ఆవులు, 1,02,332 గేదెలు ఉన్నాయి. వీటన్నిటికీ గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసేందుకు జిల్లా పశు సంవర్థక శాఖ సమాయత్తమైంది. ఇందుకోసం జిల్లాలోని భువనగిరి, రామన్నపేట, మోత్కూర్ ఏరియా ఆసుపత్రులను కలుపుకుని 31 పశువైద్యశాలలు, 41 పశువైశాల ఉపకేంద్రాల్లో ముగ్గురు ఏడీఏలు, 31 మంది పశు వైద్యాధికారులు, 50 మంది సిబ్బంది 47 బృందాలుగా గ్రామాల్లో పర్యటించి వైద్యసేవలు అందించనున్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో జాతీయ పశు వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు టీకాల పంపిణీ ఉంటుందని అధికారులు తెలిపారు.

గాలికుంటు వ్యాధి వ్యాప్తి ఇలా..

పశువులకు సోకే ప్రధాన వ్యాధుల్లో గాలికుంటు ఒకటి. గాలి ద్వారా వ్యాపిస్తుంది. ప్రధానంగా ఈ వ్యాధి ఆఫ్తో వైరస్(ఏడు విభిన్న సెరోటైప్‌లతో) ద్వారా వస్తుంది. వ్యాధి సోకిన జంతువులతో ప్రత్యక్ష సంబంధం(లాలాజలం, పాలు, వీర్యం, విసర్జన ద్వార వ్యాపిస్తుంది. కలుషితమైన వాహనాలు, పరికరాలు, దుస్తుల ద్వారా వ్యాపిస్తుంది. అంతే కాకుండా పశువులు కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం వల్ల వ్యాప్తి చెందుతుంది. కలుషితమైన ఆహారం, నీరు తీసుకోకుండా రైతులు జాగ్రత తీసుకోవాలి.

ఆర్థిక ప్రభావం

గాలికుంటు వ్యాధి అరుదుగా సోకే ప్రాణాంతక వ్యాధి కాకపోయినప్పటికీ శాశ్వత ప్రభావాలు తీవ్రంగా ఉంటాయి. వ్యాధి బారినపడ్డ పశువుల్లో పాల దిగుబడి తగ్గుతుంది. శాశ్వత కుంటితనం రావడం, దీర్ఘకాలిక పొదుగు వాపు, అబార్షన్ కావడం, గర్భం దాల్చడంలో సమస్యలు రావడం ఉంటాయి. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతారు.

నియంత్రణ, చికిత్స ..

పశువుల నోరు, కాలిగిట్టల మధ్య ఏర్పడిన పుండ్లను పొటాషియం పర్మాంగనేట్ ద్రావణంతో శుభ్రంగా కడగాలి. తరువాత బోరోగ్లిజరిన్ పేస్టును పుండ్ల పై రాయాలి. పెన్సిలిన్ వంటి యాంటిబయాటిక్ మందులను పశువులకు ఇవ్వాలి.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పశువులకు వేయించాలి



ప్రతి ఆరు నెలలకు ఒకసారి టీకాను వేయిస్తే పశువులకు గాలికుంటు వ్యాధి సోకదు. నాలుగునెలల వయస్సు నిండిన దూడల నుంచి అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి. యాదాద్రిభువనగిరి జిల్లా వ్యాప్తంగా గాలికుంటు వ్యాధి నివారణ వైద్య కార్యక్రమం ఈ నెల 15 నుంచి వచ్చే నెల 14 వరకు కొనసాగుతుంది. ఈ వ్యాధి సోకితే ప్రధానంగా పశువుల్లో పాల దిగుబడి తగ్గుతుంది. పశువులు గాలికుంటు వ్యాధి బారిన పడక ముందే జాగ్రత్తలు తీసుకోవడం ముఖ్యం.

- డాక్టర్ జానయ్య, జిల్లా పశు విద్యాధికారి

నివారణ ఇలా

వ్యాధిసోకిన పశువులను వేరు చేసి బయట తిరగనివ్వొద్దు. పశువులషెడ్లు, ప్రాంగణాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. షెడ్లను సోడియం కార్బొనేట్‌సోడియం హైడ్రాక్సైడ్ వంటి క్రిమిసంహారక మందుతో శుభ్రంచేసుకోవాలి. షెడ్లలోకి బయట వ్యక్తులు రాకుండా చూసుకోవాలి.గాలికుంటు టీకాను ఏడాదికి రెండుసార్లు పశువులకు వేయించాలి.

వ్యాధి లక్షణాలు ..

గాలికుంటు వ్యాధి సోకిన పశువులు 24 గంటల్లోగా చిక్కిపోయి అల్సర్‌కు గురవుతాయి. వ్యాధి బారిన పడిన పశువుల ఉష్ణోగ్రత 104డిగ్రీల నుంచి106 డిగ్రీల వరకు ఉంటుంది. రెండు నుంచి ఆరు రోజుల వరకు జ్వరం తీవ్రత ఎక్కువగా ఉంటుంది. నోరు, పెదాలు, నాలుక, చన్నులతో పాటు కాళ్ల గిట్టల మధ్య పుండ్లు వచ్చి అనతికాలంలోనే ఈ వ్యాధి వ్యాపిస్తుంది. ఈ వ్యాధి సోకిన పశువులు ముడుచుకుని పడుకుంటాయి. దీని కారణంగా పశువులు మేత మేయవు, నీళ్లు సరిగా తాగవు, నెమరు వేయలేవు. నోటి నుంచి సొంగ లేక నురుగు కారుతుండడంతో పాటు పశువులు బరువు తగ్గిపోతాయి. పశువుల్లో పునరుత్పత్తి తగ్గిపోయి, చూడి పశువులు ఈరుసుకు పోయే(అబార్షన్)అవకాశం ఉంటుంది. కాళ్ల మధ్యన పుండ్లు రావడంతో సరిగా నడవలేవు.

పాల ఉత్పత్తి తగ్గడమే కాకుండా వ్యాధి నిరోధక శక్తి తగ్గి కొన్నిసార్లు పశువులు(ఎక్కువగా దూడలు)చనిపోయే అవకాశం ఉంటుంది. ముందస్తు నివారణలో భాగంగా టీకాలు వేయించడమే ఉత్తమమని పశువైద్యాధికారులు తెలిపారు. వ్యాధి సోకిన పశువుల పాలను తాగిన దూడలు చనిపోయే అవకాశముంది.

ఆసరా పింఛన్ల పంపిణీలో చిల్లర సాకులు

(ఆంధ్రజ్యోతి - మిర్యాలగూడ టౌన్)

ప్రభుత్వం వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు ఆసరా కల్పించేందుకు అమలుజేస్తున్న పింఛన్ పథకం డబ్బుల్లో రూ.16 కోత పడుతున్నాయి. ప్రభుత్వం వృద్ధులు, ఒంటరి మహిళలు రూ.2016, దివ్యాంగులకు రూ.4016లు అందిస్తోంది. అయితే చిల్లర తేవాలని లేకుంటే పింఛన్లు అందించే సిబ్బంది రూ.16 ఇవ్వడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. చిల్లర(పదహారు రూపాయలు) అడిగితే చికాకు పడుతున్నారని, వచ్చే నెలలో వేలిముద్ర పడటంలేదని, ఫేస్ రికగ్నిజేషన్ కావడంలేదని వేధిస్తున్నారని పలువురు లబ్ధిదారులు వాపోతున్నారు. పింఛన్ సొమ్ముతోనే నెలంతా ఆధారమవుతోందని, తమకిచ్చే అరకొర సాయంలో కోత విధించడం తగదంటున్నారు. ఇదిలా ఉంటే లబ్ధిదారులలో అనర్హులే ఉండటం, వారు రూ.16ను నిర్లక్ష్యం చేస్తున్నారు. అయితే నిజమైన లబ్ధిదారులపై ఆ ప్రభావం చూపుతోంది. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పరిధిలో పింఛన్లు తీసుకునే లబ్ధిదారుల సంఖ్య 10,927గా ఉంది. ఇందులో వృద్ధాప్య పింఛన్లు 3455, దివ్యాంగులు 1,434, వితంతువులు 4,923, చేనేత కార్మికులు 222, కల్లుగీత కార్మికుల 83, ఒంటరి మహిళలు 810 మంది ఉన్నారు.



ఎన్నెస్పీ క్యాంపు పోస్టాఫీసులో బారులుదీరిన లబ్ధిదారులు

తగిన చర్యలు తీసుకుంటాం



వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు ఆసరా ఇచ్చేందుకే ప్రభుత్వం పింఛన్ అందిస్తోంది. ప్రభుత్వం మంజూరు చేసిన మొత్తాన్ని అణా పైసతో సహా లబ్ధిదారులకు అందజేయాలి. పింఛన్ డబ్బుల్లో రూ.16 మినహాయించుకుంటే తగినచర్యలు తీసుకుంటాం. లబ్ధిదారులు తమకు వచ్చే పింఛన్‌లో రూ.16 ఇవ్వకుంటే అడిగి మరీ తీసుకోవాలి.

- గణవేణి శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్, మిర్యాలగూడ.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురికి గాయాలు

● కోదాడలో తెగిపడిన కాలు



గాయపడిన నర్సయ్య

కోదాడ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణ పరిధి శ్రీరంగాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి కాలు తెగిపోయింది. సీఐ శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం శ్రీరంగాపురానికి చెందిన కుర్రి నర్సయ్య వ్యవసాయ పనుల నిమిత్తం తన పొలానికి వెళ్లి గడ్డికోసుకుని తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్-విజయవాడపై కార్లు, లారీలు వస్తుండగా రహదారి వెంట నిల్చున్నాడు. ఈ క్రమంలో విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేస్తూ నర్సయ్యను ఢీకొట్టింది. దీంతో నర్సయ్య కుడి కాలు తెగి 50 మీటర్ల దూరంలో పడినట్లు స్థానికులు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు నర్సయ్యను ప్రథమచికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కారు డ్రైవర్ అతివేగం, నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగినట్లు తెలిపారు. నర్సయ్య తమ్ముడు వెంకన్న ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తున్న చేస్తున్నట్లు తెలిపారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి

కేతేపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని తుంగతుర్తి గ్రామంలో మోటారు సైకిల్ పైనుంచి జారిపడి ఇరువరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తుంగతుర్తి గ్రామానికి చెందిన వీరబోయిన నాగశంకర్, జటంగి సంపత్ మండలంలోని కొర్లపహాడ్ గ్రామంలోని మోడల్‌స్కూల్‌లో చదివి 10వ తరగతిలో ఉత్తీర్ణులయ్యారు. పాఠశాల నుంచి వారి సర్టిఫికెట్లు తీసుకునేందుకు సోమవారం ద్విచక్రవాహనంపై స్కూల్ వచ్చారు. స్కూల్‌లో పనిచూసుకుని చెరుకుపల్లి మీదుగా తుంగతుర్తి వెళ్తున్న క్రమంలో గ్రామశివారులోకి రాగానే బైక్ అదుపు తప్పి కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108సర్వీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్సఅందించి నకిరేకల్ ఏరియాఆసుపత్రికి చేర్చారు.

మహిళలపైకి దూసుకెళ్లడంతో..

బొమ్మలరామారం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలో సోమవారం జరిగిన కారు ప్రమాదంలో నలుగురు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ బుగ్గ శ్రీశైలం, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం జలాల్‌పూర్ గ్రామానికి చెందిన రంగాపురం రాములు చనిపోవడంతో అతడి అంత్యక్రియలకు బంధువులు, స్థానికులు హాజరయ్యారు. అంత్యక్రియల అనంతరం మెయిన్‌రోడ్డు పక్కన ఉన్న వాటర్‌ట్యాంక్ వద్ద కాళ్లు, చేతులు శుభ్రం చేసుకుంటున్నారు. అదే సమయంలో అంత్యక్రియలకు హాజరైన సతీష్ నిర్లక్ష్యంతో అజాగ్రత్తగా కారుతో వేగంగా మహిళలపైకి దూసుకెళ్లాడు. దీంతో మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లా మునిరాబాద్‌కు చెందిన చేమంత, లక్ష్మి, ఎల్లమ్మ, స్వరూపలు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వారిని మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లాలోని ఆర్‌వీఎం ఆసుపత్రికి 108వాహనంలో తరలించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

బాలిక ఆత్మహత్య

భువనగిరి టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి పట్టణం సీతానగర్‌కు చెందిన బాలిక(17) సోమవారం ఆత్మహత్య చేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఇంటర్ ఒకేషనల్ కోర్స్ పూర్తి చేసిన బాలిక ఇటీవలే స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రి ల్యాబ్‌లో విధుల్లో చేరింది. ఈక్రమంలో ఆదివారం అర్ధరాత్రి వరకు కుటుంబసభ్యులతో ఉన్న బాలిక ఇంటి పక్కనే ఉన్న శ్మశానవాటికలోని గదిలో ఉరివేసుకుంది. ఈ మేరకు సోమవారం తెల్లవారుజామున గమనించిన కుటుంబసభ్యులు పట్టణ పోలీసులకు సమాచారమిచ్చారు. అయితే ఆత్మహత్య చేసుకున్న గది గోడపై చాక్‌పీస్‌తో ఆమె రాసిందని భావిస్తున్న సెల్‌ఫోన్ నెంబర్, అర్ధరాత్రి వరకు ఫోన్‌లో మాట్లాడి అనంతరం వెళ్లి ఆత్మహత్య చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఈమేరకు మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి ఆధారాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు భువనగిరి పట్టణ ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

'ఆదర్శ' విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

సంస్థాన్ నారాయణపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): దసరా సెలవులకు ఇంటికి వెళ్లి వచ్చిన విద్యార్థిని ఆదర్శ పాఠశాల భవనం మొదటి అంతస్తుపై నుంచి ఆత్మహత్యాయత్నం చేసింది. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండల కేంద్రంలో ఈ సంఘటన జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. సంస్థాన్‌నారాయణపురం మండలంలోని జనగాం గ్రామానికి చెందిన కొండూరు సాత్విక మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. దసరా సెలవులకు ఇంటికి వెళ్లిన సాత్వికను సోమవారం మధ్యాహ్నం తల్లిదండ్రులు పాఠశాలలో వదిలి వెళ్లటంతో తరగతి గదికి వెళ్లింది. పాఠశాలకు వచ్చిన రెండు గంటల్లోనే పాఠశాల భవనం మొదటి అంతస్తుపై నుంచి దూకటంతో కాలు విరిగింది. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు వైద్య చికిత్సల నిమిత్తం చౌటుప్పల్ హాస్పిటల్‌కు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఈ సందర్భంగా విద్యార్థిని సంచిలో మై డియర్ ఫ్రెండ్స్, ఫ్యామిలీ ఐ మిస్‌యూ బాయ్ బాయ్ అంటూ ఉన్న ఓ లేఖను స్వాధీనం చేసుకున్నారు. వసతి గృహంలో ఉండటం ఇష్టం లేకే విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసిందని ప్రిన్సిపాల్ దీప తెలిపారు.

దేవరకొండలో చోరీ

దేవరకొండ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో పట్టపగలు దొంగతనం జరిగింది. కాలనీకి చెందిన సైదులు వస్త్ర దుకాణం నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇంటికి తాళం వేసి భార్య, భర్తలు సోమవారం దుకాణానికి వెళ్లారు. మధ్యాహ్నం భోజనానికి ఇంటికిరాగా ఇంటి తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోని రూ.లక్షా 10వేల నగదు అపహరణకు గురైందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు దేవరకొండ సీఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

అడ్డగూడూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): యాద్రాది భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలోని డి. రాపాకలో విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన అండెం నర్సిరెడ్డి పాడి గేదే మేత కోసం విడిచిపెట్టగా మేసుకుంటూ వెళ్లి సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్‌కు తగిలింది. దీంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. గేదే విలువ సుమారు రూ.90 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

యాదగిరిగుట్ట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆధ్యాత్మికవాడలో గుర్తుతెలియని మృతదేహాన్ని యాదగిరిగుట్ట పోలీసులు గుర్తించారు.సోమవారం తెల్లవారుజామున 5 గంటలకు కల్యాణకట్ట వద్ద సుమారు 40 నుంచి 45 ఏళ్ల వ్యక్తి మృతదేహం కనిపించింది. శరీరంపై కుడి చేతికి బొటనవేలు మాత్రమే ఉంది. దేవస్థాన శానిటేషన్‌విభాగం అవుట్‌సోర్సింగ్ సూపర్‌వైజర్ పాండురాజు శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ బొడ్డుపల్లి భాస్కర్ తెలిపారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

ఆత్మకూరు(ఎస్), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు ఈ నెల 15న సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం నెమ్మికల్‌లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఏఎస్ఎం ఎడ్యుకేషన్ నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. వివరాలకు సెల్ 8143539030, 9494349959 నెంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాని బ్రిడ్జి పనులు

(ఆంధ్రజ్యోతి - హుజూర్‌నగర్)

నాలుగేళ్ల కిందట ప్రారంభించిన హుజూర్‌నగర్ మండలంలోని శ్రీనివాసపురం-అమరవరం గ్రామాల మధ్య బ్రిడ్జి పనులు నేటికీ పూర్తికాకపోవడంతో ప్రజలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మార్గంలో మట్టపల్లి మేజర్ పరిధిలో పెద్దఎత్తున పొలాల వృథా జలాలు వెళ్లే శ్రీనివాసపురం గ్రామసమీపంలో గత ప్రభుత్వం 2021 రూ.60 లక్షలతో బ్రిడ్జి పనులు ప్రారంభించింది. యాతవాకిళ్ల, అమరవరం, అంజలిపురం, హనుమంతులగూడెం గ్రామాల ప్రజలు, విద్యార్థులు, రైతులు నిత్యం ఈ మార్గం గుండానే రాకపోకలు సాగిస్తుంటారు. వర్షాకాలంలో తరుచూ ఈ మార్గంలో వరద పెరిగి రాకపోకలు ఇబ్బందులు ఎదురవయ్యేవి. ఈ నేపథ్యంలో చేపట్టిన బ్రిడ్జి పనులు నాలుగేళ్లయినా పూర్తికాలేదు. బ్రిడ్జి పనులు స్లాబ్ పోసి మధ్యలో వదిలేశారు. ఎప్పుడు పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది.



అసంపూర్తి బ్రిడ్జి, డైవర్షన్ రోడ్డుపై బోల్తాపడిన మినీవాహనం(ఫైల్)

కొట్టుకుపోయిన డైవర్షన్ రోడ్డు

బ్రిడ్జి నిర్మాణ సమయంలో రాకపోకల కోసం డైవర్షన్ రోడ్డు నిర్మించారు. అయితే రెండు నెలల కిందట కురిసిన భారీ వర్షాలకు డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోయింది. ఈ క్రమంలో బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించి రెండు నెలలు కావస్తోంది. అయినప్పటికీ పనులు చేపట్టలేదు. వరద సమయంలో బ్రిడ్జికి రెండువైపులా నామమాత్రంగా మొరంపోసి ద్విచక్రవాహనాలు వెళ్లేలా చదునుచేశారు. దీంతో ఈ మార్గంలో లారీలు, బస్సులు, ఇతర ట్రాక్టర్లు, వాహనాలు వెళ్లాలంటే ఇబ్బందిగా మారింది. ఇటీవల రెండు ఆటోలు డైవర్షన్ రోడ్డు నుంచి వెళుతున్న సమయంలో పల్టీ కొట్టి పలువురికి గాయాలయ్యాయి. అదేవిధంగా కొద్దిరోజుల క్రితం అమరవరం నుంచి హుజూర్‌నగర్‌కు ధాన్యం లోడుతో వస్తున్న మినీ లారీ పల్టీ కొట్టింది. దాంతో లారీలోని ధాన్యం బస్తాలన్నీ వరద కాల్వలో పడిపోవడంతో రైతుకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ డైవర్షన్ రోడ్డు నుంచి హుజూర్‌నగర్ పట్టణంలోని వివిధ ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే స్కూల్ బస్సులు ప్రయాణిస్తుంటాయి. కాగా ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. బ్రిడ్జి నిర్మాణం ఏళ్ల తరబడి పూర్తికాకపోవడంతో రవాణా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. అధికారులు ఇప్పటికైనా స్పందించి మరిన్ని ప్రమాదాలు జరగకుండా బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బ్రిడ్జిని వెంటనే పూర్తిచేయాలి



అమవరం-శ్రీనివాసపురం గ్రామాల మధ్య అర్థాంతరంగా నిలిచిపోయిన బ్రిడ్జి పనులను వెంటనే పూర్తిచేయాలి. నాలుగేళ్ల కిందట బ్రిడ్జి పనులు ప్రారంభించి మధ్యలో వదిలేశారు. దాని ఫలితంగా ఆటోలు, ట్రాక్టర్లు, మినీ లారీలు డైవర్షన్ రోడ్డుపై పడిపోయి ప్రమాదాలు జరుగుతున్నాయి. అనేక మందికి గాయాలయ్యాయి. అధికారులు వెంటనే స్పందించి పనులు పూర్తిచేయాలి.

ఉస్తెల శ్రీనివాసరెడ్డి, రైతు

త్వరలోనే బ్రిడ్జి పనులు పూర్తి చేస్తాం

శ్రీనివాసపురం-అమరవరం గ్రామాల మధ్య బ్రిడ్జి పనులను త్వరలోనే పూర్తిచేస్తాం. బిల్లులు రాక పనులు ఆలస్యమవుతున్నాయి. కాంట్రాక్టర్‌ను పనులు పూర్తిచేయాలని ఆదేశించా. బ్రిడ్జి పనులు పూర్తి చేసి ప్రమాదాలు నివారిస్తాం.

రమేష్‌బాబు, డీఈ, ఆర్అండ్‌బీ

పోలీస్ సిబ్బంది నిష్పక్షపాతంగా వ్యవహరించాలి



డీఐజీ చౌహాన్‌కు గౌరవ వందనం చేస్తున్న పోలీసులు, చిత్రంలో ఎస్పీ శరత్‌చంద్రపవార్

మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో పోలీస్ సిబ్బంది నిష్పక్షపాతంగా వ్యవహరించి బాధితులకు న్యాయం చేయాలని మహబూబ్‌నగర్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ అన్నారు. యూరియా కోసం చేపట్టిన ధర్నాలోపాల్గొన్న గిరిజన రైతుపై థర్డ్‌డిగ్రీ ప్రయోగించి దుర్భాషలాడారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న వాడపల్లి ఎస్ఐపై విచారించేందుకు మహబూబ్‌నగర్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ సోమవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు వచ్చారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి సోమవారం మిర్యాలగూడ డీఎస్పీ కార్యాలయాన్ని సందర్శించి, పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం వాడపల్లి ఎస్‌హెచ్‌వో పనితీరు, ప్రవర్తనపై, సంఘటనకు దారితీసిన కారణాలు తదితర అంశాలపై అధికారులను విచారించి వివరాలను నమోదు చేసుకున్నారు. గిరిజనరైతు పట్ల ఎస్ఐ ప్రవర్తనపై వచ్చిన ఆరోపణలో వాస్త అవాస్తవాలు ఏ మేరకు ఉన్నాయన్న దానిపై సమగ్రంగా విచారించారు. అనంతరం డివిజన్ పరిధిలో నమోదవుతున్న కేసుల వివరాలకు సంబంధించిన రికార్డులను సైతం పరిశీలించి కేసుల విచారణలో సిబ్బంది పారదర్శకంగా వ్యవహరించాలని, నిందితులకు శిక్షపడేందుకు కావాల్సిన అనిరకాల సాక్ష్యాధారాలను సిద్ధంచేయాలని సూచించారు. నేరాలను నియంత్రించేందుకు పోలీస్‌శాఖ అమలు చేస్తున్న శాఖాపరమైన చర్యలను క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేయాలన్నారు. పోలీస్‌శాఖపై ప్రజల్లో నమ్మకం కలిగేవిధంగా వ్యవహరించాలని, అవినీతి, అక్రమాలను నియంత్రించడంలో నిస్వార్థంగా పనిచేయాలని సూచించారు. రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిరంతర నిఘా కొనసాగించి గంజాయి, ఇతర అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని, ఎస్పీ పర్యవేక్షణలో పెండింగ్ కేసుల విచారణ మరింతగా వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం డీఎస్పీ కార్యాలయంలో క్రైం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కాగా, డీఎస్పీ కార్యాలయాన్ని సందర్శించేందుకు వచ్చిన డీఐజీ చౌహాన్‌కు ఎస్పీ శరత్‌చంద్రపవార్, డీఎస్పీ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు గౌరవ స్వాగతం పలికారు. కార్యక్రమంలో సీఐలు నాగభూషణం, సోమనర్సయ్య, పీఎన్డీప్రసాద్, మాడ్గులపల్లి, వేములపల్లి ఎస్ఐలు కృష్ణయ్య, వెంకటేశ్వర్లు ఉన్నారు.

తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న కిసాన్ మోర్చా నాయకుడు మధుసూదన్‌రెడ్డి

మాడ్గులపల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలో ఆదివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి ఐకేపీ సెంటర్లలో పోసిన ధాన్యం తడిసిపోయి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని బీజేపీ జాతీయ కిసాన్ మోర్చా నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని ఐకేపీ సెంటర్‌లో వర్షానికి తడిసిన రైతుల ధాన్యాన్ని పరిశీలించి మాట్లాడారు. ఆరుగాలం కష్టించి పండించి రైతులు ధాన్యాన్ని ఐకేపీ కేంద్రానికి తరలిస్తే అకాల వర్షానికి ధాన్యం తడిసిపోవడంతో రైతులకు కన్నీళ్లే మిగిలాయన్నారు. ప్రభుత్వం వెంటనే తడిసిన ధాన్యానికి ఎలాంటి షరతులు లేకుండా మద్దతు ధరకు కొనుగోలు చేయాలని అన్నారు. ఐకేపీ సెంటర్లలో వెంటనే ధాన్యానికి కాంటాలు వేసి ధాన్యాన్ని ఎగుమతి చేయాలన్నారు. అకాల వర్షాలు కురుస్తున్నందున వ్యవసాయాధికారులు ఎప్పటికప్పుడు రైతులకు సమాచారం అందించి నష్టపోకుండా చూడాలన్నారు. రైతులకు అన్యాయం చేస్తే సహించేది లేదని బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వంపై ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు గడ్డం వెంకట్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఇటికాల జాన్‌రెడ్డి, వంగూరు రవి, బుర్రి వెంకట్‌రెడ్డి, బుర్రి కలమ్మ, బాల్నె సత్యంరెడ్డి, తెలమల్ల సైదులు పాల్గొన్నారు.

గాంధీజీ లక్ష విగ్రహాల సేకరణ

చండూరు, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ స్వర్ణోత్సవాల సందర్భంగా సోమవారం చండూరు పట్టణంలోని గాంధీజీ విద్యాలయంలో గాంధీజీ లక్ష విగ్రహాల సేకరణ కార్యక్రమాన్ని గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ ట్రస్ట్ వైస్ చైర్మన్ డాక్టర్ యానాల ప్రభాకర్‌రెడ్డి, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు డాకర్ కోడి శ్రీనివాసులు కలిసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ మహాత్మా గాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం, స్వదేశీ, స్వావలంబన, స్వాభిమానంతో కూడిన జీవితం సాధించే దిశగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. నేటి యువతరానికి గాంధీ ఇచ్చిన సందేశాన్ని చేరవేయడంతోపాటు సుస్థిర అభివృద్ధి, శాంతి, నైతిక విలువలు, సామాజజిక సంఘీభావం బలోపేతం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్నట్లు వారు తెలిపారు. ప్రపంచంలోనే ఎత్తైన గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి, విశ్వవ్యాప్తం చేయడానికి కృషి చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి సంఘీభావంగా ఈ లక్ష విగ్రహాల సేకరణ కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో నాయకులు జీవీరావు, పుచ్చకాయల వెంకట్‌రెడ్డి, గొట్టిపర్తి చంద్రశేఖర్, అశోక్, పలల్లె శ్రీనివాస్‌గౌడ్, శిరంశెట్టి శ్రీధర్‌బాబు, సరికొండ వెంకన్న పాల్గొన్నారు.

బీకేఎన్‌కే సంఘ్ ఉమ్మడి జిల్లా కార్యవర్గం ఎన్నిక

నల్లగొండ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): భారత ఆహార సంస్థలో జాతీయ స్థాయిలో గుర్తింపు యూనియన్ అయిన బీకేఎన్‌కే సంఘ్ ఉమ్మడి నల్లగొండ జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా గోపయ్య, కార్యదర్శిగా శ్రీకాంత్‌రెడ్డిని ఎన్నుకున్నారు. యూనియన్‌కు సంబంధించి తెలంగాణ ప్రాంత సీనియర్ ఉపాధ్యక్షులు సతీష్‌రెడ్డి, సీనియర్ అదనపు కార్యదర్శి రాహుల్ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. గత కార్యవర్గంలో అధ్యక్ష, కార్యదర్శులుగా పనిచేసిన శ్రీదర్, శ్రీశైలంలకు అభినందలు తెలిపారు. రాంబాబు, అరుణ్, దివ్య, రూప, కిరణ్, మధు, అజయ్, గోపి ఉన్నారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న ఎస్‌జీఎఫ్ సెక్రటరీ విమల

నాగార్జునసాగర్, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి):తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ నెట్ బాల్ పోటీల్లో నల్లగొండ జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు జిల్లా నెట్ బాల్ అసోషియేషన్ కార్యదర్శి కిరణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9, 10, 11తేదీలల్లో మహబూబ్‌నగర్ జిల్లా పాలమూరు స్టేడియంలో జరిగిన పోటీల్లో రాష్ట్రంలో 28 జిల్లాల జట్లు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఎస్‌జిఎఫ్ సెక్రటరీ విమల అభినందించారు. బాలికల విభాగంలో జిల్లా జట్టు ద్వితీయ స్థానం, బాలుర విభాగంలో తృతీయ స్థానం సాధించినట్లు ఆయన తెలిపారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లా వాలీబాల్ పోటీలకు..

మఠంపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వర్ధాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న సొదసోతు హర్షిత ఈనెల 14న ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జరిగే అండర్-17 పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ వీరస్వామి తెలిపారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగిన (ఎస్‌జీఎఫ్ఐ)అండర్-17 బాలికల విభాగంలో ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో రాణించాలని హెచ్‌ఎం కోరారు. ప్రతిభ చూపిన విద్యార్థి హర్షితను హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

నారాయణపురం విద్యార్థుల ఎంపిక

చిలుకూరు : మండలంలోని నారాయణపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు జిల్లా అండర్-14 వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. సోమవారం కోదాడలో జరిగిన డివిజన్ స్థాయిలో అండర్-14 విభాగంలో 9వ తరగతి చదువు తున్న అశ్విని, మధు, మేఘన ప్రతిభ కనబరిచి జిల్లా జట్టులో ఎంపికైనట్లు పీడీ సీతారాంరెడ్డి తెలిపారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు నరసింహారెడ్డి, పాఠశాల చైర్మన్ విరూపాక్ష, పీడీ సీతారాంరెడ్డి ఉపాధ్యాయులు అభినందించారు.

చీకటి రహదారిలో..

● జాతీయ రహదారిపై వెలగని లైట్లు ● ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు



కొండమల్లేపల్లిలో జాతీయ రహదారిపై లైట్లు వెలగకపోవడంతో అంధకారం

కొండమల్లేపల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై వెలగని లైట్లతో వాహనదారులు, పట్టణవాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. జాతీయ రహదారులపై నిత్యం పెద్దసంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన లైట్లు వెలుగక చీకటిలో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి చౌరస్తా వద్ద కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారి-167 డివైడర్ల మధ్య లక్షలాది రూపాయలతో లైట్లు ఏర్పాటు చేశారు. అవి పది రోజులు వెలిగిన దాఖలాలు లేవు. జాతీయ రహదారిపై నిత్యం వందల కొద్దీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కొండమల్లేపల్లి చౌరస్తా నుంచి దేవరకొండ రోడ్డులోని తహసీల్దార్ కార్యాలయం వరకు డివైడర్ల మధ్య ఏర్పాటు చేసిన లైట్లు వెలగక సమారు రెండు నెలలు కావొస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని యూటర్న్ వద్ద ప్రమాదాలు చోటు చేసుకొని పలువురు వాహనదారులు గాయలపాలయ్యారు. జాతీయ రహదారి డివైడర్ల మధ్యలో చెట్లు ఏర్పాటు చేయడంతో అవి ఏపుగా పెరిగి లైట్లు వెలగక చీకటి ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, ప్రజలు భయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లైట్ల వెలిగేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

లైట్లు వెలగడం లేదు



దేవరకొండ రోడ్డు చౌరస్తా నుంచి స్థానిక తహసీల్దార్ కార్యాలయం వరకు సుమారు రెండు నెలలుగా లైట్లు వెలగడం లేదు. దీంతో జాతీయ రహదారి అంధకారంగా మారింది. యూటర్న్ వద్ద వాహనాలు మలిపే క్రమంలో వెలుతురు లేక చీకటి కారణంగా ప్రమాదాలు జరిగాయి. కాలినడక వెళ్లాలంటే జాతీయ రహదారి కావడంతో వాహనాలు వేగంగా వస్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంది.

● తోటపల్లి వెంకటయ్య, కొండమల్లేపల్లి.

రెండు నెలల నుంచి లైట్లు వెలగక..



కోదాడ: సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో సెంట్రల్ లైటింగ్ లైట్లు వెలగడం లేదు. పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం ఎదుట ఖమ్మం క్రాస్‌రోడ్డు, గుడిబండ రోడ్డులో ఖమ్మం వెళ్లే రహదారిలో విజయవాడ వెళ్లే రహదారిలో వీధిలైట్లు రెండు నెలల నుంచి వెలగడం లేదు. మునిసిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో పట్టణ వాసులు చీకట్లలోనే ఉంటున్నారు. లైట్లు వెలగకపోవడంతో వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. వెలగకపోవడంపై వివిధ పార్టీల నాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పన్నులు చెల్లిస్తున్నా లైట్లు ఎందుకు వేయడం లేదని పట్టణవాసులు ప్రశ్నిస్తున్నారు.

ఇబ్బంది పడుతున్నాం

మున్సిపాలిటీకి పన్ను చెల్లిస్తున్నా వీధిలైట్లు వెయ్యకపోవడంతో రాత్రిపూట వాహనాలు నడపాలంటే ఇబ్బంది పడుతున్నాం. ఖమ్మం క్రాస్ రోడ్డు నుంచి రంగాథియేటర్ వరకు వెళ్లాలంటే నానా తంటాలు పడుతున్నాం. ● ముంద్రా రవి, కోదాడ.

శివకేశవులకు విశేష పూజలు



శివాలయంలో స్పటిక లింగానికి హారతి నివేదిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి కొండపై సోమవారం శివకేశవులకు విశేష పూజలు కొనసాగాయి. స్వయంభు స్వామిఅమ్మవారికి వైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, పర్వతవర్థిని రామలింగేశ్వరస్వామివారి శివాలయంలో స్పటికమూర్తులకు శైవాగమశాస్త్రరీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామిఅమ్మవారిని మేల్కొలిపిన అర్చకులు మూలమూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించిన పూజారులు విశ్వక్సేనుడికి తొలి పూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు ఆగమశాస్త్రరీతిలో కొనసాగాయి. శివాలయంలోని ముఖమండపంలో స్పటిక మూర్తులను అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు. శివపార్వతుల ఉత్సమూర్తులకు పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ. 15,63,056ఆదాయం సమకూరినట్లు ఇన్‌చార్జి ఈవో గుగులోతు రవినాయక్ తెలిపారు.

ప్రసాదాల విక్రయశాల వద్ద గ్రిల్స్ బిగింపు



యాదగిరిగుట్ట దేవస్థానంలో చింతపండు దొంగతనం జరిగిన నేపథ్యంలో ప్రసాదాల విక్రయశాలకు గ్రిల్స్ బిగించారు. విక్రయశాల కౌంటర్లు, వాటికి సంబంధించిన ప్రధాన ద్వారంతో పాటు శివాలయం వెళ్లే దారిలో కూడా గ్రిల్స్ బిగించారు. పండగ, పర్వదినం, ఇతర సెలవు, రద్దీ రోజుల్లో ప్రధానాలయం, శివాలయం సందర్శన, ప్రసాదాల సేకరణకు భక్తులు అటు ఇటు వెళ్లేందుకు అవే గ్రిల్స్ దారికి అడ్డుగా బిగించడంతో ఇరుకుగా మారి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పవన్‌కుమార్

నాగార్జునసాగర్, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ పైలాన్‌కాలనీ డీఏవీ పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 10,11వ తేదీల్లో హైదరాబాద్ సఫిల్‌గూడలో డీఏవీ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించి రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పవన్‌కుమార్ తెలిపారు. **అండర్-17 బాలికల విభాగం నెట్‌బాల్‌లో** అరడ్ల సహస్రరెడ్డి, ఎం. అనన్య, పి. పావని, కె. ధరణి, జి. రక్షిత, సమీనా బేగం, **బాలుర విభాగంలో...** రాఘవేంద్ర, విశాల్, జీవానంద్, అజయ్, దిలీప్, వినయ్ సాయి, శివరాం, రవిచంద్ర, **షార్ట్‌పుట్‌లో..** విశాల్ ఎంపికైనట్లు తెలిపారు. వచ్చే నెలలో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను జెన్‌కో సీఈ మంగేష్‌కుమార్, ఎస్ఈలు రఘురాం, రామకృష్ణరెడ్డి, ఈఈ సత్యశివకుమార్, ఎస్ఏవో శిరీష, డీఏవీ ఏఆర్‌వో జీఆర్‌కే ప్రసాద్, పీఈటీ సాయికృష్ణ తదితరులు అభినందించారు.

అక్రమ డిప్యూటేషన్లపై చర్యలు తీసుకోవాలి




నల్లగొండ డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

తిరుమలగిరి(సాగర్), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలంలో కొనసాగుతున్న ఉపాధ్యాయుల అక్రమ డిప్యూటేషన్లను రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్ నల్లగొండలో సోమవారం డీఈవో భిక్షపతికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్వాలతండా, సుంకిశాలతండా, నెల్లికల్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు అక్రమంగా డిప్యూటేషన్ల పేరిట కొనసాగుతున్నారని తెలిపారు. తక్షణమే జిల్లా అధికారులు సంబంధిత డిప్యూటేషన్లపై విచారణ చేయాలన్నారు. అక్రమంగా కొనసాగుతున్న ఉపాధ్యాయులను అవసరమైన పాఠశాలలో సర్దుబాటు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కోరె రమేష్, సహాయ కార్యదర్శి మారుపాక కిరణ్ తదితరులు ఉన్నారు.

క్రీడలతో చురుకుదనం, ఏకాగ్రత

భువనగిరి టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో చురుకుదనం, ఏకాగ్రత, పట్టుదల పెరుగుతాయని యాదాద్రిభువనగిరి జిల్లా డీఈవో సత్యనారాయణ అన్నారు. ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలబాలికల జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నీని సోమవారం భువనగిరిలో ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు ఆసక్తిగత క్రీడలలో రాణించేందుకు ప్రయత్నించాలని, ఇందుకు పాఠశాలల వారీగా గుర్తించిన విద్యార్థులను ప్రోత్సహిస్తామని అన్నారు. పీఈటీలు ప్రతిరోజు తప్పనిసరిగా విద్యార్థులతో వ్యాయామం, క్రీడలు ఆడించాలని సూచించారు. అనంతరం ఉత్సాహంగా సాగిన పోటీలలో బాలుర విభాగంలో పోచంపల్లి (ప్రథమ), తుర్కపల్లి (ద్వితీయ) బాలికల విభాగంలో ఆలేరు (ప్రథమ), అడ్డగూడూరు (ద్వితీయ) బహుమతులు సాధించాయి. అధికారులు విజేతలకు బహుమతులు అందజేశారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కే దశరథరెడ్డి, అధికారులు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

నిలకడగా మూసీ నీటిమట్టం



కేతేపల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మూసీ ప్రాజెక్టు నీటిమట్టం 644.40అడుగుల వద్ద నిలకడగా కొనసాగుతోంది. ఎగువ నుంచి వచ్చే ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టింది. హైదరాబాద్ నగరంతో పాటు ఎగువ మూసీ పరివాహక ప్రాంతాల్లో రోజుల తరబడి విస్తారంగా కురిసిన వర్షాలకు పది రోజులుగా వరద నీరు వచ్చి దిగువన గల మూసీ రిజర్వాయర్‌లో చేరుతోంది. ఎగువన వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ప్రాజెక్టుకు రెండు రోజులుగా రెండు వేల క్యూసెక్కులను మించడం లేదు. ఆదివారం సాయంత్రానికి 2018.50క్యూసెక్కులు ఉన్న ఇన్‌ఫ్లో సోమవారం సాయంత్రానికి మరింత తగ్గి 1711.21క్యూసెక్కులుగా నమోదైంది. ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోకు అనుగుణంగా ప్రాజెక్టు అధికారులు క్రస్టుగేట్లను ఆపరేట్ చేస్తున్నారు. 645అడుగులు(4.46టీఎంసీలు) పూర్తి స్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 644.40అడుగులు(4.30టీఎంసీలు)గా ఉంది.

ఆరోగ్యకర జాతి నిర్మాణంలో యువ వైద్యుల పాత్ర కీలకం



హరియాణా రాష్ట్ర మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయకు జ్ఞాపికను అందజేస్తున్న ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ (డాక్టర్) అహంతెం శాంతాసింగ్

● *హరియాణా రాష్ట్రమాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ*

బీబీనగర్ ఎయిమ్స్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఆరోగ్యకరమైన జాతి నిర్మాణానికి యువ వైద్యులు అంకితం కావాల్సి ఉందని హరియాణా రాష్ట్ర మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కోరారు. సోమవారం యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్‌లోని అఖిల భారతీయ వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) సముదాయాన్ని ఆయన సందర్శించారు. ఎయిమ్స్ బీబీనగర్ అధ్యాపకులు, పరిపాలనా అధికారులతో పాటు ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ (డాక్టర్) అహంతెం శాంతాసింగ్ ఆయనకు హృదయపూర్వక స్వాగతం పలికారు. తరువాత, ప్రొఫెసర్ (డాక్టర్) అహంతెం శాంతాసింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో కొనసాగుతున్న నిర్మాణ కార్యకలాపాలు, అందించే వివిధ విద్యాకోర్సులు, రోగులకు అందిస్తున్న వివిధ విద్యాకోర్సులు, రోగులకు అందిస్తున్న సేవలపై వివరంచారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ కరుణ, నైతికతతో కూడా వైద్యసేవలు అందించడంలో యువ వైద్యులు ముందునిలవాలని ఆయన సూచించారు. అనంతరం ఎయిమ్స్ క్యాంపస్‌లో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ (డాక్టర్) అహంతెం శాంతాసింగ్, డీన్ (విద్యశాస్త్రం) డాక్టర్ నితిన్ అశోక్‌జాన్, డిప్యూటీ డైరెక్టర్ (అడ్మినిస్ట్రేషన్) డాక్టర్ బిపిన్ పి.వర్గీస్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహేశ్వర్ లక్కిరెడ్డి, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ విశాకజైన్, సూపరింటెండింగ్ ఇంజనీర్ డి.గోవర్ధన్, ఓఎస్డీ కమ్ పీఆర్‌వో ప్రశాంత్ ఉన్నారు.

చిట్యాలలో దుకాణాల్లోకి చేరిన నీరు

చిట్యాల, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలతో పాటు సోమవారం ఉదయం కురిసిన వర్షానికి చిట్యాలలో మిల్క్‌సెంటర్ పక్కన సర్వీస్ రోడ్డు వెంట ఉన్న దుకాణాల్లోకి వర్షపు నీరు భారీగా చేరింది. దుకాణాల్లోని సామగ్రి తడిసి తీవ్ర నష్టం వాటిల్లింది. దుకాణాల వెనుక ఉన్న ఇళ్లలోకి కూడా నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షపు నీరు సర్వీస్ రోడ్డు ప్రవహిస్తుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

యూత్ ఫర్ సేవా ఆధ్వర్యంలో బ్యాగుల పంపిణీ

కట్టంగూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కట్టంగూరులోని జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు యూత్ ఫర్ సేవా ఆధ్వర్యంలో సోమవారం ఉచితంగా బ్యాగులు పంపిణీ చేశారు. దీంతో పాటు 8వ తరగతి విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ పరీక్ష సంబంధించిన పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ ఫర్ సేవా సభ్యులు తిరుపతి సైదులు, పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం కొంక అంటోని, ఉపాధ్యాయులు శ్రీనివాస్, విఠల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి

చిట్యాల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి);ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయాలనీ సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో చిట్యాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రైతులు కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం తడిసిందన్నారు. కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని, కేంద్రాల్లో తారుపాళ్లు, కాంటాలు, హమాలీలు అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐతరాజు నర్సింహ, బొబ్బల వెంకటరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బొడ్డు బాబురావు, చిర్రబోయిన శ్రీశైలం, మెండె తిరుమలేష్, రావుల మాల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తడిసిన ధాన్యం పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

సమస్యలు పరిష్కరించండి..

'ప్రజావాణి' కార్యక్రమానికి వినతుల వెల్లువ

నల్లగొండ (కలెక్టరేట్),అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమంలో సమస్యల పరిష్కారం కంటి తుడుపు చర్యగానే మారాయి. అవే సమస్యలు... అవే కష్టాలు... వచ్చిన వారే మళ్లీ మళ్లీ తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తిరుగుతూనే ఉన్నారు. వారి సమస్యకు ఎప్పుడు పరిష్కారం లభిస్తుందోనన్న విషయం మాత్రం తెలియరావడం లేదు. దీంతో వారంవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అధిక సంఖ్యలో తరలివస్తున్నా రు. వారిలో కొందరు వ్యక్తిగత అంశాలపై హాజరవుతుండ గా మరికొందరు సామాజిక అంశాలపై వస్తున్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి జిల్లా నలుమూలల నుంచయి తరలివచ్చిన బాధితుల నుంచి వినతులను స్వీకరించి వాటిలో కొన్నింటి ని అక్కడిక్కడే పరిష్కరించగా మరికొన్నింటి సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు లేఖలు రాశారు.



కలెక్టరేట్‌లో బాధితుల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

డైయిరీ ఫాం వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి

పట్టణంలో అనేకమంది ఎలాంటి అనుమతులు లేకుండా డెయిరీ ఫాంలను నిర్వహిస్తూ కల్తీ పాలతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి ఫలితం లేదు. అదేవిధంగా మునిసిపాలిటీలో అక్రమ నిర్మాణాలపై గతంలో వచ్చిన ఆరోపణలపై హైకోర్టు కేసుకు సంబంధించిన ఫైలు కూడా గల్లంతైంది. అయినా అక్రమ నిర్మాణదారులపై కాని కోర్టు కోర్టు కేసు ఫైల్ చేసిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో మునిసిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. తక్షణమే వారిపై చర్యలు తీసుకోని ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడాలి.



- ఉప్పల సంతోష్‌కుమార్, నకిరేకల్

పెండింగ్ వేతనాలు ఇప్పించండి

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద తామంతా కన్సాలిడేటెడ్ అటెండర్లుగా వివిధ కేటగిరిలలో కొన్ని సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నాం. అయితే మాకు ఆరు నెలలుగా వేతనాలు రాకపోవడంతో మేము, మా కుటుంబ సభ్యులందరం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. సంవత్సరానికి ఒక్కసారి ఘనంగా నిర్వహించుకునే దసరా పం డగను కూడా ఈ సారి సరిగా చేసుకోలేకపోయాం. దీపావళి పండగ రాబోతున్నందున అప్పటివరకైనా తమకు రావాల్సిన వేతనాలను ఇప్పించి ఆదుకోవాలి.

- డీఆర్‌డీఏ కన్సాలిడేటెడ్ అటెండర్లు

సర్వే నిర్వహించండి



నాకు మా గ్రామంలోని సర్వే నెంబర్ 550/60లో సుమారు 20 గుంటల పట్టా భూమి ఉంది. ఇందుకు సంబంధించి పట్టాదారు పాసుపుస్తకం ఉంది. మా భూమికి పక్కనే కలిగిన ఇతర సర్వే నెంబర్లతో కూడా భూములున్నాయి. మాకు ఉన్న భూమిలో మేము కొంతకాలంగా సేద్యం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాం. అయితే మాకు ఉన్న పట్టా భూములకు సంబంధించి సర్వే నిర్వహించి హద్దులను నిర్ణయించాలని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా సర్వే ల్యాండ్ రికార్డు అధికారులకు కేటాయించారు. రెండేళ్లుగా అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అధికారులు మాత్రం సర్వే నిర్వహించి ఇప్పటి వరకు హద్దులను నిర్ణయించలేదు. దయచేసి సర్వే నిర్వహించండి.

కె. వనజాత, నార్కట్‌పల్లి

భూ ఆక్రమణకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

నాకు మాగ్రామంలో సర్వే నెంబర్ 136/2లో ఎకరం, 252/6/1లో 2 ఎకరాలు, 252/6/2లో మూడెకరాలు మొత్తం 6 ఎకరాలు ఉండగా సేద్యం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాను. ఈ భూమి నాకు వారసత్వంగా సక్రమించింది. అయితే కొందరు వ్యక్తులు నకిలీ పత్రాలు సృష్టించి నా భూమిని వారి పేరిట పట్టా మార్పిడి చేసుకున్నారు. అయితే విషయం తెలుసుకున్న తాను వారిని నిలదీయగా నాకు వారసులు ఎవరూ లేరని నాపై దాడికి దిగారు. దీంతో పెద్ద మనుషుల్లో పంచాయతీ పెట్టించగా పట్టా చేస్తామని ఒప్పుకొని సంవత్సరాలు గడుస్తున్నా ఇంత వరకు కూడా పట్టా మార్పిడి చేయలేదు. పైగా అందులోని ఎకరా భూమిని ఇతరులకు కూడా విక్రయంచారు. ఇప్పటికైనా తనకు న్యాయం చేయండి.

- రాములమ్మ, వడ్డెపల్లి, నాంపల్లి మండలం

ఎడతెరపి లేని వర్షం

జలమయమైన లోతట్టు ప్రాంతాలు - ఐకేపీ కేంద్రాల్లో తడిసిన ధాన్యం - ఇబ్బందులు పడుతున్న రైతులు

కట్టంగూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కట్టంగూరు మండలంలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురుస్తుంది. అంతేకాక పైప్రాంతాల నుంచి వస్తున్న వరదతో మండలంలోని రహదారులపై వర్షపు నీరు ప్రవహిస్తోంది. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని మునుకుంట్ల గ్రామపంచాయతీ పరిధిలోని కుమ్మరిగూడెం, ఈదులూరు గ్రామాల మధ్య ఉన్న వాగుపై నీరు ప్రవహిస్తుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు మండలంలోని 65వ నెంబర్ జాతీయ రహదారి నుంచి ఎరసానిగూడెం గ్రామానికి వెళ్లే దారి మధ్యలో వాగు రోడ్డు పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ప్రజలు నానాఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజులుగా ఇక్క వాగు రహదారికి అ డ్డంగా ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వివిధ పనుల నిమిత్తం కట్టంగూరుకు వచ్చే ప్రజల చుట్టూ తిరిగి సుమారు నాలుగు కిలోమీటర్లు ఎక్కువగా ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి మండల కేంద్రంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో కొన్ని వార్డుల్లో గల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఎగువ మునుగోడు రోడ్డు, వైఎల్ లాడ్జీ వెనుక నివాసాల నుంచి వచ్చే డ్రైనేజీ వాటర్‌తో పాటు వర్షం నీరు కూడా చేరడంతో పట్టణ పంచాయతీ 5, 6వ వార్డుల్లోని కొన్ని నివాసాల్లోకి నీళ్లు చేరాయి. పాత జాతీయ రహదారి నుంచి అయ్యప్ప కాలనీకి వెళ్లే దారిలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేదు. దీంతో వరద నీరు బయటకు పోయేదారి లేక కాలనీల్లోని ఖాళీ ప్రదేశాలు, లోతట్టు ప్రాంతాల్లోని నివాసాల్లోకి చేరుతున్నాయి. రోడ్డు విస్తరణ పనుల్లో రోడ్డు ఎత్తు కూడా పెరిగిన కారణంగా లోతట్టులో ఉన్న నివాసాల్లోకి నీరు చేరి నష్టాన్ని కలగజేస్తున్నాయని, తమ సమస్యను పరిష్కరించాలని ఎన్నిసార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కరించడం లేదని బాధితులు ఆవేదన చెందుతున్నారు.



శాలిగౌరారం : మార్కెట్ యార్డులో వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యం

శాలిగౌరారం: శాలిగౌరారం మండల వ్యాప్తంగా 2.5 సెంటీమీటర్ల వర్షం పండిదని తహసీల్దార్ వరప్రసాద్ తెలిపారు. ఈ వర్షానికి చేతికొచ్చిన వరి చేలు నేలకొరిగాయి. శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ యార్డుతో పాటు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించిన ధాన్యం తడిసి ముద్దయింది. కొంతమంది రైతుల ధాన్యం వర్షపు నీటిలో కొట్టుకుపోయింది. దీంతో రైతులు అనేక ఇబ్బందులు పడ్డారు.



కట్టంగూరు : ఎరసానిగూడెం వెళ్లే రహదారిలో రోడ్డుకు అడ్డంగా ప్రవహిస్తున్న నీరు



కట్టంగూరు : కుమ్మరిగూడెం - ఈదులూరు మధ్య రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీటితో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



నార్కట్‌పల్లిలోని 5వ వార్డు పరిధి లోతట్టు ప్రాంతంలో జలమయమైన నివాసాలు

మద్యంపై ఎమ్మెల్యే సమరం

(5వ పేజీ తరువాయి)

మండలంలో మూడు, మునుగోడు, చండూరు మండలాల్లో నాలుగు చొప్పున, మర్రిగూడ, నాంపల్లి మండలాల్లో మూడు చొప్పున, గట్టుప్పల్‌లో ఒక మద్యం దుకాణం కలిపి మొత్తం 29 ఉన్నాయి.

ఏడాదిన్నర నుంచి బెల్ట్ దుకాణాల నిర్మూలనకు యత్నాలు

నియోజకవర్గంలో విచ్చలవిడిగా మద్యం వినియోగాన్ని తగ్గించడమే లక్ష్యంగా కార్యాచరణ మొదలుపెట్టిన ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఏడాదిన్నర క్రితం 2024 మే నెల నుంచి బెల్ట్ దుకాణాల నిర్మూలన కార్యక్రమం చేపట్టారు. ఒక సందర్భంలో ఆయన సైతం ఉదయం 10గంటలకే మునుగోడులోని ఒక సిట్టింగ్ వద్దకు వచ్చి ఉదయాన్నే మద్యం తాగడానికి వచ్చిన యువకుడిని గుర్తించి కౌన్సిలింగ్ ఇచ్చారు. నియోజకవర్గంలో విచ్చలవిడిగా ఒక్కో గ్రామంలో 10 నుంచి 15 వరకు ఉన్న బెల్ట్‌షాపులన్నింటినీ ఎత్తివేయించారు. విస్తృత స్థాయిలో పోలీసులతో దాడులు చేయించడంతో కొన్ని నెలల పాటు బెల్ట్‌దుకాణాల నిర్వహణ నిలిచింది. పోలీస్ దాడులే తప్ప ఎక్సైజ్‌శాఖ నుంచి వీటి నిర్మూలనకు పూర్తిస్థాయిలో చర్యలు లేకపోవడంతో ఐదారు నెలల తర్వాత మళ్లీ పండుగలు, జాతరలు, పార్టీల పేరుతో మెల్లగా కొన్ని కొన్ని గ్రామాల్లో బెల్ట్ దుకాణాలు మొదలయ్యాయి. అయితే గతంలో మాదిరిగా విచ్చలవిడిగా కాకపోయినా విక్రయాలు మాత్రం కొనసాగుతున్నాయి. అయితే నేరుగా దుకాణాలు నడపకుండా మొబైల్ పద్ధతిలో, అవుట్‌డోర్ డెలివరీ పద్ధతిలో బెల్ట్‌దుకాణాల నిర్వాహకులు మద్యం విక్రయిస్తున్నారని ఆయా గ్రామస్థులు చెబుతున్నారు. పోలీసులకు సైతం దొరకకుండా పొలాల వద్ద, బావుల వద్ద ఏ రోజుకారోజు మద్యం నిల్వచేసి అడిగిన మద్యంపై క్వార్టర్‌కు రూ.40 అదనంగా తీసుకొని డోర్‌డెలివరీ లేదా అవుట్‌డోర్ డెలివరీ చేస్తున్నారని చెబుతున్నారు. ఎమ్మెల్యే సీరియస్‌గా బెల్ట్‌షాపుల నిర్మూలనపై హెచ్చరిస్తున్నా గ్రామాల్లో ఈ పరిస్థితి కొనసాగుతోందని అంటున్నారు. కేవలం పోలీసులే కాకుండా ఎక్సైజ్‌శాఖ సిబ్బంది సైతం మద్యం దుకాణాల్లో తప్ప బయట విక్రయించకుండా కట్టడి చేస్తే బెల్ట్‌దుకాణాల నిర్మూలన, మద్యం వినియోగం తగ్గుతుందని, ఈ దిశగా చర్యలకు ఎమ్మెల్యే ప్రతిపాదించాలని నియోజకవర్గ ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేసిన వారిలో మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు దోటి వెంకన్న, పల్లె వెంకన్న, చంద్రశేఖర్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలుని కల్యాణం



నార్కట్‌పల్లిలోని వేణుగోపాల స్వామి ఆలయంలో కల్యాణంలో పాల్గొన్న భక్తులు

నార్కట్‌పల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని శ్రీ వారిజాల వేణుగోపాలస్వామి దేవస్థానంలో సోమవారం మాస కల్యాణాన్ని నిర్వహించారు. పట్టణానికి చెందిన రెముడాల సత్తయ్య కుటుంబసభ్యులు కల్యాణ ఉత్సవం వేదిక వద్ద కూర్చున్నారు. ఆలయ అనువంశిక అర్చకులు కారంపూడి వేంకటాచార్యులు, కృష్ణమాచార్యుల మంత్రోచ్చారణల మధ్య రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణ వేడుక శాస్త్రోక్తంగా వైభవంగా జరిగింది. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు నడింపల్లి అంజమ్మ, దూదిమెట్ల సత్తయ్య, స్రవంతి, ఆలయ చైర్మన్ దోసపాటి ప్రసాద్, ఐతరాజు రమేష్, సామ కొండల్‌రెడ్డి, దుబ్బాక శ్రీధర్, బండారు రమేష్, జెరిపోతుల భరత్, ఇడుకుళ్ల బిక్షమయ్య, దోసపాటి విష్ణుమూర్తి, పసునూరి శ్రీనివాస్, అమరవాది రాములు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు సక్రమంగా నిర్వహించాలి

శాలిగౌరారం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సంబంధిత అధికారులు, సిబ్బంది ఎలాంటి ఆటంకం కలగకుండా నిర్వహించాలని తహసీల్దార్ వరప్రసాద్ కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ధాన్యం కొనుగోళ్ల నిర్వహణలో వివిధ శాఖల సమన్వయ సమావేశం నిర్వహించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కనీస వసతులు ఏర్పాటు చేయాలని, నాణ్యమైన ధాన్యం తీసుకరావడానికి రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ధాన్యంలో తేమ లేకుండా రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకవచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సౌమ్య శృతి, పాక్స్ సీఈవో నిమ్మల అంజనేయులు, ఏపీఎం పోలేపల్లి శంకర్, మండల అదనపు గిర్ధావర్ మహ్మద్ రఫీ, అన్ని గ్రామాల ఏఈవోలు, అన్ని గ్రామాల గ్రామపాలన అధికారులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

సబ్ మార్కెట్‌లో సౌకర్యాలు కరువు

కనగల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) కనగల్ వ్యవసాయ సబ్ మార్కెట్ యార్డులో అంధకారం అలుముకుంది. కనీస వసతులు కరువై రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఎస్ఎల్‌బీసీ, తిప్పర్తి సబ్‌మార్కెట్ యార్డుల్లో రైతులకు కనీస సౌకర్యాలను కల్పిస్తున్న నల్లగొండ ఏఎంసీ అధికారులు కనగల్ సబ్ మార్కెట్ యార్డును అభివృద్ధి చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. సబ్‌మార్కెట్‌ను కలెక్టర్ సందర్శించి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేశారు. రైతులకు కనీస సౌకర్యాలను కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించినా పట్టించుకోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే మార్కెట్‌ను అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు.

కార్యకర్తల అభీష్టం మేరకే

డీసీసీ అధ్యక్ష పదవిపై నిర్ణయం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

● ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, అక్టోబర్ 13, (ఆంధ్రజ్యోతి): డీసీసీ అధ్యక్ష పదవి ఎంపిక విషయంలో జిల్లాలోని ఆరు నియోజకవర్గాల కార్యకర్తల అభిప్రాయం తీసుకున్న తర్వాతనే అధిష్ఠానం నిర్ణయం ప్రకటిస్తుందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. సోమవారం పట్టణంలోని లక్ష్మీసుజాత ఫంక్షన్‌హాల్‌లో డీసీసీ అధ్యక్ష ఎంపిక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీసీసీ అధ్యక్ష పదవి ఎంపిక విషయంలో నకిరేకల్ నియోజకవర్గానికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకున్నా ఆ నిర్ణయం మేరకు తాము పనిచేస్తామని తెలిపారు. రాహుల్‌గాంధీ, మల్లిఖార్జున్‌ఖర్గే, సోనియాగాంధీ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్ష పదవి కోసం ఎన్నిక ప్రక్రియ మొదలైందన్నారు. పార్టీలో ఏ ఎన్నిక జరిగిన పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఏజీసీసీ మాజీ జనరల్ సెక్రటరీ బిస్వరాజన్ మహంతి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దైద రవీందర్, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం మొత్తం ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

ధాన్యం మొత్తం ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. సోమవారం నకిరేకల్ మండలంలోని కడపర్తి, చందంపల్లి, గోరెంకలపల్లి, మంగళపల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ అకాల వర్షాలు వస్తున్నాయి కాబట్టి రైతులు జాగ్రత్తగా ఉండాలన్నారు. తడిసిన ధాన్యాన్ని కూడా త్వరగా కొనుగోలు చేస్తామన్నారు. ప్రభుత్వం తరుపున అన్ని శాఖల అధికారులతో ధాన్యం కొనుగోలుపై నిరంతరం సమీక్ష చేయడం జరుగుతుందన్నారు. ప్రతి గింజను కొనుగోలు చేస్తాం ఎవ్వరూ అధైర్యపడవద్దన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్‌రావు, నాయకులు బచ్చుపల్లి గంగాధర్‌రావు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

నల్లగొండ, నకిరేకల్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మంజుల, భవాని

కనగల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) పోషకాహారం తీసుకోవటం ద్వార సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చుని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల అన్నారు. మండలంలోని కురంపల్లి హైస్కూల్‌లో సోమవారం పోషన మాసోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు పోషకాహారంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈసందర్భంగా మంజుల మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఆకుకూరలు, పండ్లు, చిరుధాన్యాలు, పోషక ఆహారాలు, విటమిన్లు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చిన్నారులకు, గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. చిన్నారుల సంరక్షణ ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శేఖర్, ఎఎన్ఎం అరుణ, అంగన్‌వాడీ టీచర్ సుజాత ఉన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి


నకిరేకల్: వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశు భ్రత పాటించడం వల్ల వ్యాధులు దరిచేరవని మండల విద్యాధికారి మేక నాగయ్య అన్నారు. సోమవారం మండలంలోని తాటికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోషకాహారం, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భవాని మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎరువ్కువ పోషకాలు లభించే ఆహారం ఎలా తయారు చేసుకోవాలో వివరించారు. చేతులు శుభ్రంగా కడుక్కునే విధానం గురించి అవగాహన కల్పించి పోషణ, ప్రతిజ్ఞ చేశారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పండుగ తిరుమలయ్య, అంగన్వాడీ టీచర్లు నాగకుమారి, నాగమణి, ఆశావర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంఈవో మేక నాగయ్య

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5
మంగళవారం 14 అక్టోబరు 2025

*** గరిష్ఠం 29.0 కనిష్ఠం 21.0



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.70 (311.1486)	68,397	68,397
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.40 (4.30)	1,711.21	1,711.21
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.029 (42.7687)	82,692	82,092

చికెన్ ధరలు | లైవ్ : రూ.130 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.220



ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

మద్యంపై ఎమ్మెల్యే సమరం

- మద్యం టెండర్ల వేళ విచ్చలవిడికి అడ్డుకట్ట వేసే ప్రయత్నం
- దుకాణాలను సాయంత్రం 4 నుంచి 8గంటల వరకే నడపాలని సూచనలు
- ఎమ్మెల్యే సూచనలతో ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రాన్ని అందజేసిన కాంగ్రెస్ నేతలు

నల్లగొండ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మద్యం టెండర్ల వేళ మునుగోడు నియోజకవర్గం మరోసారి రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. నియోజకవర్గంలో మద్యం దుకాణాల నిర్వహణకు ప్రజల తరఫున షరతులు విధిస్తామని, వీటిని పాటించేవారే టెండర్లలో పాల్గొనాలని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సూచించారు. ఎమ్మెల్యే సూచనలు అమలు చేసేందుకు ఎక్సైజ్ అధికారులు సహకరించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు, ఆయన అనుచరులు ఎక్సైజ్‌శాఖ జిల్లా అధికారికి వినతిపత్రం అందజేశారు. ఏడాదిన్నర నుంచి నియోజకవర్గంలో బెల్ట్ దుకాణాలను నియంత్రించే చర్యలు చేపట్టారు. మద్యం దుకాణాలకు టెండర్లు నడుస్తున్న సందర్భంలో ఇప్పటి నుంచే కట్టుదిట్టమైన నియంత్రణకు చర్యలు తీసుకోవాలనే ఉద్దేశంతో షరతులను తెరమీదకు తేవడంతో వీటి ఫలితం ఎలా ఉండనుందనే ఆసక్తి సర్వత్రా నెలకొంది.

గ్రామాల్లో సామాజికరుగ్మతగా మారిన మద్యపానం

మునుగోడు నియోజకవర్గంలో పర్యటిస్తున్న పలు సందర్భాల్లో ఎందరో యువకులు చిన్నవయసులోనే మద్యానికి బానిసై విచక్షణారహితంగా ప్రవర్తిస్తున్న విషయం తన దృష్టికి వచ్చిందని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి పలు సందర్భాల్లో ఆవేదన వ్యక్తం చేశారు. మద్యానికి బానిసై 30 ఏళ్లలోపే చనిపోతే, వారి భార్యలు చిన్నవయసులో పిల్లలను పోషించేందుకు ఎన్నో కష్టనష్టాలు పడుతున్న విషయం తననలు కలచివేసిందని పేర్కొన్నారు. గత పదేళ్లలో గ్రామాల్లో సామాజికరుగ్మతగా మద్యపానం మారిందన్నారు. కనీసం మునుగోడు నియోజకవర్గంలోనైనా ఈ పరిస్థితిని మార్చాలనే ఉద్దేశంతో తొలుత బెల్ట్‌దుకాణాల నిర్మూలనకు చర్యలు చేపట్టారు. ఇప్పుడు మద్యం విక్రయాల నియంత్రణకు కార్యాచరణ ప్రతిపాదించారు.ప్రజలను ఆరోగ్యవంతులుగా ఉంచడం, మనిషి జీవన ప్రమాణాలు పెంచడమే తన లక్ష్యమని పేర్కొంటున్న ఎమ్మెల్యే.. బెల్ట్‌షాపుల నిర్మూలన, మహిళా సాధికారత కోసమే ఈ నిర్ణయం తీసుకున్నామని, అంతేతప్ప ఎవరినీ ఇబ్బందులకు గురిచేయాలని కాదని స్పష్టం చేస్తున్నారు.

సాయంత్రం తర్వాతే మద్యం విక్రయాలు

మునుగోడు నియోజవర్గంలో మద్యం దుకాణం ఎవరికి వచ్చినా సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకే మద్యం విక్రయాలు చేయాలని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సూచిస్తున్నారు. అదేవిధంగా గ్రామాల్లో కాకుండా ఊరుబయటనే మద్యం దుకాణాలు ఏర్పాటు చేయాలని, దుకాణాల వద్ద సిట్టింగులు నిర్వహించేది లేదని, కేవలం దుకాణమే నడపాలని ప్రతిపాదించారు. అదేవిధంగా బెల్ట్‌దుకాణాలను ఎట్టి పరిస్థితుల్లో నడవనిచ్చేది లేదని హెచ్చరించారు. సిండికేట్లు ఉండవద్దని, బెల్ట్‌దుకాణాలకు మద్యం విక్రయించవద్దని సూచించారు. నల్లగొండ, యాదాద్రి జిల్లాల్లో విస్తరించిన మునుగోడు నియోజకవర్గంలో ఏడు మండలాలు, రెండు మునిసిపాలిటీలు కలిపి 29 మద్యం దుకాణాలు, నాలుగు బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయి. చౌటుప్పల్ పట్టణంలో మూడు, చండూరు పట్టణంలో ఒక బార్, చౌటుప్పల్ మండలంలో 11 మద్యం దుకాణాలు, సంస్థాన్‌నారాయణపురం

- మిగతా 8వ పేజీలో...



మునుగోడులో మద్యం దుకాణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి (ఫైల్)



ముందస్తు జాగ్రత్తే ఔషధం

- పశువుల్లో గాలికుంటు వ్యాధి
- అలసత్వం వహిస్తే మృత్యువాత పడే ప్రమాదం
- రేపటి నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు

6

అభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ (కలెక్టరేట్), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల ప్రత్యేక అధికారులు అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. సోమవారం 'ప్రజావాణి' కార్యక్రమంలో బాధితుల నుంచి ఫిర్యాదులు తీసుకొని జిల్లా అధికారులతో పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు కేంద్రాలన్నింటినీ వెంటనే ప్రారంభించాలని, కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని, అకాల వర్షాకి ధాన్యం తడవకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక అధికారులు అన్ని కేజీబీవీలు, మోడల్ పాఠశాలలను తనిఖీ చేయాలని, మండల స్థాయిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పర్యవేక్షించాలన్నారు. పూర్వ ప్రాథమిక విద్యకు సంబంధించి విద్యార్థుల నమోదును పెంచాలని డీఈవో భిక్షపతిని ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో నిర్మిస్తున్న వికలాంగుల ధ్రువపత్రం జారీ కేంద్రం పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని డీఆర్డీవో శేఖర్‌రెడ్డిని ఆదేశించారు. సీపీఆర్‌పై వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, ఇన్‌చార్జి డీఆర్వో వై.అశోక్‌రెడ్డి, గృహ నిర్మాణశాఖ పీడీ రాజ్ కుమార్, దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి పాల్గొన్నారు.

జీవిత బీమా సౌకర్యాన్ని వినియోగించుకోవాలి

వాహనాల ద్వారా స్వల్పకాలిక పనులు నిర్వహించే వారందరూ జీవిత బీమా సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఇటీవల స్వల్పకాలిక కార్మికుల సంఖ్య పెరుగుతోందని, అమెజాన్, జొమాటో, ఫ్లిప్‌కార్ట్, తదితర సంస్థలలో వాహనాల ద్వారా పనిచేసేవారు, డెలివరీ బాయ్‌లు, డ్రైవర్లు, కార్మికులు బీమా పాలసీలో చేరాలన్నారు. ఏడాదికి రూ.20 చెల్లిస్తే బ్యాంకులు రూ.2లక్షల వరకు బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నాయన్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్లు అవగాహన కల్పించాలని, బీమా పాలసీ శిబిరాలు నిర్వహించాలని అన్నారు.

ఇసుక తవ్వకాల సమాచారం వెబ్‌సైట్‌లో

ఇసుక తవ్వకాలకు సంబంధించి వివిధ శాఖలు సమర్పించిన నివేదికలను క్రోడీకరించి వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. ఇసుక తవ్వకాలపై నీటిపారుదల, గనులు, భూగర్భ జల వనరులు, టీఎస్ ఎంఐడీసీ, అటవీ, రెవెన్యూ, ముఖ్య ప్రణాళికాధికారి శాఖలు సమర్పించిన నివేదికలను జిల్లా సమగ్ర నివేదికగా (డీఎస్‌ఆర్)గా మార్చి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. దీనిపై ఏవైనా సందేహాలు, సలహాలు, అభ్యంతరాలు ఉంటే ఈనెలలో 25లోగా తెలియజేయాలని కోరారు.

చి'వరి'దశలో..

నేలవాలిన ఆశలు



కోతదశలో నేలవాలిన వరిపైరు

- పంటలను దెబ్బతీస్తున్న వానలు
- వరిని ఆశిస్తున్న పొట్టకుళ్లు తెగులు
- దిక్కుతోచని స్థితిలో రైతులు

మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): వానాకాలం పంటలపై ప్రతికూల వాతావరణ పరిస్థితులు ప్రభావం చూపుతున్నాయి. జూలై మాసాంతం వరకు సాధారణంగానే నమోదైన వర్షపాతం ఆ తరువాత ఏర్పడ్డ వాతావరణ పరిస్థితుల కారణంగా వరుసగా మోతాదుకు మించి వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో చెరువులు, కుంటలు నిండుకుండను తలపిస్తూ అలుగుపోస్తుండగా, ప్రతీ నెల దాదాపు పక్షంరోజుల వరకు తెరుచుకున్న నాగార్జునసాగర్ ప్రాజెక్టు క్రస్ట్‌గేట్ల నుంచి దిగువకు కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూనే ఉంది. అయితే వరుసగా కురుస్తున్న వర్షాలు పంటలను దెబ్బతీస్తున్నాయి. ప్రధానంగా సెప్టెంబరుతోపాటు ఈ నెలలో కురుస్తున్న వర్షాలతో అధికంగా నష్టం వాటిల్లితోందని రైతులు వాపోతున్నారు.

జిల్లాలో ప్రధానంగా సాగైన వరి పంటకు వరుసగా కురుస్తున్న వర్షాలతో కొంత మేలుతోపాటు నష్టాన్ని మిగుల్చుతోందని రైతులు చెబుతున్నారు. ప్రతీ నెలలో కొద్దిరోజుల వరకు ఎండ తీవ్రత అధికంగా ఉండడం, ఆ తరువాత ఎడతెరపిలేకుండా కరుస్తున్న వర్షాలతో పైర్లు ఏపుగా పెరిగి యూరియా అవసరాన్ని కాసింత తగ్గించాయి. ఇదే దశలో వ్యవసాయ క్షేత్రాల్లో నీటినిల్వ అధికంగా ఉండడంతో పొట్టకుళ్లు తెగులు ఆశించి పైర్లు దెబ్బతింటున్నాయి. మిర్యాలగూడ డివిజన్ పరిధిలో 1,44,500 విస్తీర్ణంలో పంటలు సాగుకాగా, వరిసాగు విస్తీర్ణం 1,16,500, పత్తిసాగు 20,280 ఎకరాలుగా నమోదైంది. 7,470 ఎకరాల్లో ఉద్యాన, వాణిజ్య, కూరగాయలపంటలు సాగవుతున్నాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం వరిపైర్లు సూది పొట్టదశకు చేరుకోగా, కొన్ని ప్రాంతాల్లో ఈతపడుతున్నాయి. ఈ తరుణంలో వారం రోజులుగా క్రమేపీ కురుస్తున్న వర్షాలకు వరి కంకి సుంకురాలిపోతోంది. దీని ప్రభావంతో దిగుబడులు తగ్గడమేగాక, ధాన్యం తూకంలో తేడాలు వచ్చే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వరి చివరి దశలో..

డివిజన్ పరిధిలోని వేములపల్లి, మాడ్గులపల్లి, త్రిపురారం, నిడమనూరు, మిర్యాలగూడ మండలాల పరిధిలో వరిపైర్లు ఈతపట్టి కంకిదశలో ఉన్నాయి. వారం రోజులుగా వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా చివరి దశకు చేరిన పంటపైర్లు దెబ్బతింటున్నాయి. సోమవారం తెల్లవారుజామున కురిసిన గాలివాన ధాటికి చివరి దశకు వచ్చిన వరి పైర్లు నేలవాలిపోయాయి. దీంతో రైతులు ఆరుగాల కష్టంపై పెట్టుకున్న ఆశలు ఆవిరైపోతుంటే కంటనీరు చమ్మగిల్లుతోంది. డివిజన్ పరిధిలో సాగైన వరిపంటలో 101 రకం, చింట్లు, 505 రకాలు అధికంగా ఉన్నాయి. 505 రకాల వరి పైర్లు కోతదశకు చేరుకున్న తరుణంలో నేలకు వాలిపోతుండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. నేలవాలిన పైరును నూర్పిడిచేయడమంటే ఖర్చుభారం పెరగడమేగాక, దిగుబడులు సైతం తగ్గి నష్టాలు మిగులుతాయని రైతులు దిగాలు పడుతున్నారు.

ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలి



వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా వరిపైరు వేరు వ్యవస్థలో పట్టుతప్పి నేలవాలిపోతోంది. పాలకంకిదశలో నేలవాలిన పంట దిగుబడిని కాపాడుకునేందుకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. ఉప్పు నీటిని పిచికారీ చేయడంతో వరి గింజలు మొలకెత్తకుండా ఉపకరిస్తుంది. పొట్టదశలో వరి పైరుకు కార్బండిజం శాతం అధికంగా ఉన్న మందులను పిచికారీ చేస్తే లాభదాయకంగా ఉంటుంది.

● డి.సైదానాయక్, ఏడీఏ, మిర్యాలగూడ

బాధితులకు న్యాయం అందేలా చర్యలు

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ

నల్లగొండ క్రైం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకుంటున్నట్టు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 35 మంది నుంచి వినతిపత్రాలు తీసుకొని మాట్లాడారు. ఫిర్యాదులపై ఫోన్‌లో సంబంధిత అధికారులతో మాట్లాడి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతిపత్రాలు తీసుకోవాలన్నారు. సంబంధిత ఫిర్యాదుపై వేగంగా స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అన్నారు.

చీఫ్ జస్టిస్‌పై దాడి ప్రజాస్వామ్యంపై దాడినే

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగా

నల్లగొండ (కలెక్టరేట్), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి దేశ ప్రజాస్వామ్య విలువలపై దాడి అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. సోమవారం ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 7న సుప్రీం కోర్టులో సీజే జస్టిస్ బీఆర్ గవాయ్‌పై షూ విసరడం అనాగరిక చర్య అని అన్నారు. దళితుడైన సీజేపై జరిగిన ఈ దాడి ప్రజాస్వామిక వ్యవస్థను, రాజ్యాంగాన్ని అవమానపరిచే ప్రయత్నమనే అన్నారు. ఈ దాడి వెనుక ఉన్న ఆధిపత్య శక్తులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సుప్రీం కోర్టు ప్రజాస్వామిక దృక్పథం కలిగిన సీనియర్ లేదా రిటైర్డ్ న్యాయమూర్తులతో స్వతంత్ర విచారణ చేయించాలన్నారు. అలాగే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. దళితుల ఎదుగుదల జీర్ణించుకోలేని కొన్ని శక్తుల కుట్రే ఈ దాడి అని అన్నారు. అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద నరేష్‌మాదిగ, మహాజన సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర నేత జానకి రామయ్య చౌదరి, మాదిగ ఉద్యోగుల సంఘం జాతీయ నాయకులు దైద సత్యంమాదిగ, ఎంజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గాదె రమేష్‌మాదిగ, ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్‌మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలమాదిగ, కూరపాటి కమలమ్మ, తరి ఏడుకొండలు, బొజ్జ దేవయ్య, పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

నల్లగొండ (కలెక్టరేట్), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యం కొనుగోలుకు వెంటనే ప్రభుత్వ కేంద్రాలను ప్రారంభించాలని కిసాన్‌మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడుతూ, గతం కంటే ఈ సారి రైతులు ధాన్యాన్ని ఎక్కువ శాతం పండించిన నేపథ్యంలో జిల్లాలో అధిక సంఖ్యలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ధాన్యం కొనుగోలులో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించి, మద్దతు ధర కల్పించాలన్నారు. రైతులకు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో బీజేపీ నాయకులు కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, పోతేపాక లింగస్వామి, మండలి వెంకన్న, కన్మంతరెడ్డి అశోక్‌రెడ్డి, గుండా నవీన్‌రెడ్డి, ఓంప్రకాష్, పక్కీర్ మోహన్‌రెడ్డి, పాదూరి వెంకట్‌రెడ్డి, పిండి పాపిరెడ్డి, జవ్వాది సత్యనారాయణ, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పోలోజు భిక్షమాచారి, భోగరి అనిల్‌కుమార్, ఏమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఏమిరెడ్డి భిక్షంరెడ్డి, బీపంగి జగ్జీవన్, మిర్యాల వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి



మాడ్గులపల్లిలో తడిచిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

మాడ్గులపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఐకేపీ కేంద్రంలో ధాన్యం కొనుగోలు ప్రారంభించకపోవడంతో ఆదివారం కురిసిన వర్షానికి ధాన్యం తడిసి వరద తాకిడికి కొట్టుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులను ఆదుకోవాలన్నారు.

కార్యక్రమంలో నాయకులు, రైతులు ఊర ఎల్లయ్య, దేవిరెడ్డి అశోక్‌రెడ్డి, మల్లారెడ్డి, పుల్లెంల శ్రీకర్, మన్యం భిక్షం, గవ్వ రవి, సీతారాంరెడ్డి, కాకులవరం నాని, నరేష్, కరుణాకర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆసరా పింఛన్ల పంపిణీలో
చిల్లర సాకులు
పింఛన్ పథకం డబ్బుల్లో రూ.16 కోత
లేదంటే చిల్లర తేవాలని హుకూం
6

పోలీస్ సిబ్బంది నిష్పక్షపాతంగా
వ్యవహరించాలి
● డీఐజీ ఎల్ఎస్ చౌహాన్
● గిరిజన రైతులను కొట్టిన ఘటనపై విచారణ
7

చీకటి
రహదారిలో
● జాతీయ రహదారిపై వెలగని లైట్లు
● ప్రమాదాలకు నెలవు
7

బుద్ధవనాన్ని సందర్శించిన సీడబ్ల్యూసీ డైరెక్టర్



బుద్ధుడి పాదాల వద్ద అంజలిఘటిస్తున్న ఆశిష్‌కుమార్ కుటుంబ సభ్యులు

నాగార్జునసాగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం ప్రాజెక్టును సీడబ్ల్యూసీ డైరెక్టర్ ఆశిష్ కుమార్, డిప్యూటీ డైరెక్టర్ రోహిత్‌సింగ్ సోమవారం సాయంత్రం సందర్శించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం సాయంత్రం సాగర్‌కు చేరుకున్న వారు బుద్ధవనాన్ని సందర్శించి బుద్ధుడి పాదాలకు పుష్పాంజలి ఘటించారు. అనంతరం చరిత, జాతక, ధ్యాన, స్థూప వనం, అవకాన బుద్ధ, మహాస్థూపాలను తిలకించారు. బుద్ధవనం విశేషాలను వారికి పర్యాటకశాఖ గైడ్ సత్యనారాయణ వివరించారు. వారి వెంట ఏఈలు కృష్ణయ్య, స్వర్ణ తదితరులు ఉన్నారు.

అధ్యక్ష పదవి బీసీలకే కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సైదులు గౌడ్

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధ్యక్ష పదవి బీసీలకే కేటాయించాలని ఆ పార్టీ ఓబీసీ విభాగ రాష్ట్ర నాయకుడు పోగుల సైదులుగౌడ్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకుడు ముక్కెర అంజిబాబు యాదవ్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. టీడీపీకి వెనుకబడిన వర్గాలను ప్రోత్సహించే పార్టీగా పేరుందన్నారు. తెలంగాణలో పార్టీ పగ్గాలు బీసీకి కట్టబెడితే కార్యకర్తలు ఉత్సాహంగా పనిచేస్తారన్నారు. ప్రజలే దేవుళ్లని, సమాజమే దేవాలయమని భావించే పార్టీ అధినేత చంద్రబాబు రాష్ట్ర అధ్యక్ష పదవిని బీసీలకే అప్పగిస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు. బీసీలకు ఆది నుంచి ప్రాధాన్యం ఇచ్చిన ఏకైక పార్టీ టీడీపీనేనని అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం పోరాడేందుకు తెలుగు తమ్ముళ్లు ముందుంటారని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు జయరాజు, కాంతాచారి, మురళి, పాల్గొన్నారు.

పర్యవేక్షణ అధికారులుగా ఉపాధ్యాయులు వద్దు

నల్లగొండ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల తనిఖీ నిమిత్తం ఉపాధ్యాయులతో పర్యవేక్షణ కమిటీల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం విద్యారంగానికి తిరోగమన చర్య అవుతుందని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.వెంకటేశం అన్నారు. సోమవారం జిల్లా కార్యాలయంలో మాట్లాడుతూ విద్యాబోధన చేయాల్సిన ఉపాధ్యాయులు పర్యవేక్షణ పేరుతో పాఠశాలలకు దూరంగా ఉంటే బోధన కుంటుపడుతుందన్నారు. పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్న సందర్భంలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుండగా, రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1,473మంది ఉపాధ్యాయులను పర్యవేక్షణ అధికారులుగా నియమించడం తగదన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకులు, ఏడుకొండల్, పుష్ప, జగతి, వెంకటేశ్వర్లు, ఖుర్షిద్‌మియా, అంజయ్య, పాల్గొన్నారు.

'గౌడ కులస్థులకే మద్యం దుకాణాలు కేటాయించాలి'

మిర్యాలగూడటౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): గౌడ కులస్థులకు కేటాయించిన షాపులను వారికే ఇవ్వాలని గౌడ సంక్షేమ సంఘం డివిజన్ అధ్యక్షుడు గుండు శ్రీరాములుగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. బినామీల పేరుతో సిండికేట్ వ్యాపారులు మద్యం దందా చేస్తున్నారని ఆరోపించారు. గౌడ కులస్థులకే కేటాయించేలా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రమేష్, శ్రీనివాస్, ఉదయభాస్కర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల అందజేత

పెద్దవూర, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులిచర్ల జడ్పీ హైస్కూల్‌లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు మిర్యాలగూడకు చెందిన దాత రూ.50 వేల విలువైన క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం సుదర్శన్ మాట్లాడుతూ విద్యార్థులు దాతలు అందించే సహకారాలను సద్వినియోగం చేసుకొని క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సిరెడ్డి, సైదిరెడ్డి, సీఆర్పీ పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షంతో అతలాకుతలం



కొమ్మేపల్లి ఎస్టీ గురుకుల పాఠశాల ఆవరణలోకి చేరిన వర్షపు నీరు

- దేవరకొండ డివిజన్‌లో వర్ష బీభత్సం,
- నాంపల్లిలో పొంగిపొర్లుతున్న వాగులు
- నిలిచిపోయిన రాకపోకలు
- నీట మునిగిన పంటలు - రైతుల ఆందోళన



మిషన్‌భగీరథ పైప్‌లైన్లు కొట్టుకుపోయి ప్రవహిస్తున్న డిండి కందుకూరు వాగు

దేవరకొండ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): దేవరకొండ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): దేవరకొండ డివిజన్‌లో మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దేవరకొండ మండలంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి దేవరకొండ మండలం కొమ్మెపల్లిలో లోతట్టు ప్రాంతం గ్రామశివారున పొలాల మధ్య నిర్మించిన గిరిజన బాలుర గురుకుల పాఠశాల ఆవరణలోకి భారీగా వరదనీరు వచ్చి చేరింది. గురుకుల పాఠశాల చుట్టూ వరదనీరు చేరడం, ప్రహరీ గోడ నిర్మించకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఆందోళన చెందారు. ప్రహరీ గోడ నిర్మించి సమస్యను పరిష్కరించాలని ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు కోరుతున్నారు. విషయం తెలుసుకున్న దేవరకొండ ఎంపీడీవో డానియెల్, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి కొమ్మెపల్లి గురుకుల పాఠశాలకు చేరుకొని వరదనీటి నివారణకు చర్యలు చేపట్టారు. డిండి మండలం కందుకూరు వాగు ప్రవహిస్తుండటంతో వాగులు వేసిన మిషన్‌భగీరథ పైప్‌లైన్లు పగిలిపోయాయి. దీంతో 20 రోజుల నుంచి డిండి, చందంపేట మండలాలలోని 90 గ్రామాలకు కృష్ణాజలాల సరఫరా నిలిచిపోయింది. కందుకూరు వాగు వరద ప్రవాహం తగ్గితేనే మిషన్‌భగీరథ పైప్‌లైన్ మరమ్మతు పనులు చేపట్టనున్నారు. డివిజన్‌లో లక్ష 70వేల ఎకరాల వరకు రైతులు పత్తి పంట సాగు చేశారు. పత్తి పంట చేతికొచ్చి తీసే సమయానికి వర్షాలు కురుస్తుండటంతో పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. దేవరకొండ మండలంలో కొమ్మెపల్లి రోడ్డుపైకి వర్షపునీరు చేరడం, గాలికి చెట్ల కొమ్మలు రోడ్డుపై విరిగిపడ్డాయి. దీంతో పోలీసులు రోడ్డుపై అడ్డంగా పడిన చెట్ల కొమ్మలను తొలగించారు. నాంపల్లి మండలం ముష్టిపల్లి వాగు ప్రవహిస్తుండటంతో దేవరకొండ నుంచి నాంపల్లి వెళ్లే బస్సులు, రాకపోకలు నిలిచిపోయాయి.

నిడమనూరు: నిడమనూరు మండలంలోని అన్ని గ్రామాల్లో తెల్లవార్లు కురిసిన భారీ వర్షం అతలాకుతలం చేసింది. లోతట్టు కాలనీలు జలమయమయ్యాయి. భారీ వర్షం కారణంగా మండలంలోని వివిధ గ్రామాల్లో వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు అలుగు పోస్తున్నాయి. మండల కేంద్రంలోని నల్లచౌట చెరువు నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరుకుని ఉధృతంగా అలుగుపోస్తుంది. వర్షంతో పంటలకు నష్టం వాటిల్లింది. వివిధ గ్రామాల్లో వరి పొలాలు నేలకొరగడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామాల్లో పంటలు నీట మునిగాయి. నిడమనూరులో చిలుకల వాగు పొంగి వరద నీరు బంకాపురం కల్వర్టును ముంచెత్తింది. దీంతో నిడమనూరు మీదుగా బంకాపురం, వెనిగండ్ల, సూరేపల్లి తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. అదేవిధంగా ఊట్కూరులో వాగు పొంగడంతో కల్వర్టు స్థానంలో నిర్మిస్తున్న బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డు మళ్లీ తెగిపోయింది. దీంతో నందికొండవారిగూడెం, గొండ్లగూడెం, సోమారిగూడెం, ముప్పారం గ్రామాలకు రాకపోకలు నిలిచాయి.

నేరేడుగొమ్ములో భారీ వర్షం

నేరేడుగొమ్ము: మండలంలో భారీ వర్షం కురిసింది. వర్షానికి రోడ్లు కొట్టుకుపోయాయి. పత్తిపంట తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొత్తపల్లి నుంచి పెద్దమునిగల్, కాచరాజుపల్లి వెళ్లే రోడ్డుపై వర్షపునీరు చేరడంతో కొద్దిసేపు రాకపోకలు నిలిచిపోయాయి.

గుర్రంపోడు: మండలంలో కురిసిన భారీ వర్షానికి పత్తి, వరి చేలు నీట మునిగాయి. పత్తిచేలు నీటమునగడంతో చేతికొచ్చిన పత్తి పంట నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొప్పులు, మోసంగి, పిట్టలగూడెం చెరువులు వర్షపునీటితో నిండి అలుగుపోస్తున్నాయి.

నాంపల్లి: మండలంలో కురిసిన భారీ వర్షానికి చెరువులు, కుంటలు నిండాయి. దేవరకొండ నుంచి నాంపల్లికి వెళ్లే ముష్టిపల్లి కాజేవే నుంచి భారీ వరద రావడంతో బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. నాంపల్లి నుంచి చండూరు వెళ్లే దారి మార్గం మధ్యలోని శేషలేటికుంట పొంగి పొర్లుతుండటంతో నాంపల్లి, చండూరుకు వెళ్లే బస్సుల రాకపోకలు కూడా నిలిచిపోయాయి. పసునూరు వాగు నిండి పారుతోంది. పత్తి చేలు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండలంలో ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో మండలంలోని కుంటలు, చెరువులు పొంగి పొర్లుతున్నాయి. పత్తి చేలు చేతికి వచ్చే సమయంలో వర్షాలు కురవడంతో పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. వివిధ గ్రామాలలో వాగులు పొంగి పొర్లుతుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. కొండమల్లేపల్లి మండల పరిధిలో కొల్‌ముంతలపహాడ్ కుంటలు పొంగిపొర్లడంతో రామునిగుండ్లతండా, మండల కేంద్రంలోని నల్లకుంట ఆదివారం రాత్రి కురిసిన వర్షాలకు దోనియాల, పచ్చర్ల బాయికుంట, కొల్‌ముంతలపహాడ్ కుంటలు పొంగి ప్రవహిస్తున్నాయి. కొండమల్లేపల్లి నల్లకుంట నిండుకుంలా మారింది.

మల్లేపల్లి పట్టణంలోని నల్లగొండ రోడ్డులో గల గౌరికుంటతండా, అబ్బనబోయినగూడెం వద్ద నీరు నిలిచి ఉండటంతో ఇళ్లలోకి నీరు వెళ్లకుండా ఎక్స్‌కవేటర్ సహాయంతో తహసీల్దార్ నరేందర్, ఎంపీడీవో సుధీర్‌కుమార్ గండికొట్టించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్, ఇరిగేషన్ అధికారులు, కొండమల్లేపల్లి ఈవో డాకునాయక్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి(సాగర్): మండలంలో కురిసిన భారీ వర్షానికి పలు చోట్ల వాగులు, వంకలు పొంగిపొర్లాయి. మండలకేంద్రానికి సమీపంలోని బడాయిగడ్డ వద్ద గల బంధం, బర్లబంధంతో పాటు కొరివేనిగూడెం సమీపంలో అల్వాల, రాజవరం మెయిన్‌రోడ్డుపై వరద పెద్ద ఎత్తున ప్రవహిస్తోంది. దీంతో కొన్ని గంటల పాటు రాకపోకలు స్తంభించాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. రంగుండ్లతండాలోని మెయిన్ సెంటర్‌లో గల లోలెవల్ బ్రిడ్జిపైకి వరద నీరు రావడంతో స్థానికులు తండా నుంచి బయటకు వచ్చేందుకు ఇబ్బందులకు గురయ్యారు.



నిడమనూరులో నీట మునిగిన పంటలు



తిరుమలగిరి(సాగర్): రంగుండ్లతండా వద్ద లోలెవల్ బ్రిడ్జి పై నుంచి ప్రవహిస్తున్న వర్షపు నీరు



కొండమల్లేపల్లి: ఐదేళ్ల తర్వాత నిండిన నల్లకుంట చెరువు


మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలుచేయాలి



మహాసభల ప్రచారం నిర్వహిస్తున్న ఐద్వా నాయకులు

వేములపల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): దేశంలోని మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పోలబోయిన వరలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శి పాదూరి గోవర్ధని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో జనవరి 25,26,27,28 తేదీల్లో నిర్వహించే ఐద్వా ఆలిండియా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు పురుషులకు సమానంగా రాణిస్తున్నా ప్రభుత్వాలు ఇంకా మహిళలను రెండో తరగతి పౌరులుగా చూస్తున్నారని ఆరోపించారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేసి సర్పంచ్, జడ్పీచైర్మన్, మునిసిపాలిటీలు, స్థానిక సంస్థల్లో మహిళలకు సంగం సీట్లు కేటాయించాలని అన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులు, హింసను, అఘాయిత్యాలను అరికట్టడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. మహిళల రక్షణకు ప్రభుత్వాలు చట్టాలు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో నాయకురాళ్లు అనిరెడ్డి మాధవి, పద్మ, నాగమణి పాల్గొన్నారు.

విద్యార్థులు సేవా దృక్పథాన్ని అలవరుచుకోవాలి



మాట్లాడుతున్న ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మద్దిలేటి

తిరుమలగిరి(సాగర్), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే సేవా దృక్పథాన్ని అలవరుచుకోవాలని ఎంజీ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.మద్దిలేటి అన్నారు. సోమవారం మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల విద్యార్థుల నేతృత్వంలో పిల్లిగుండ్లతండాలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ పాల్గొనడం ద్వారా సమాజంపై అవగాహన, బాధ్యతతో పాటు సేవాభావం పెంపొందుతాయని అన్నారు. విద్యార్థులు ఈ శిబిరం ద్వారా మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ఉండే సమస్యలు, వాటి పరిష్కారంపై ఆకళింపు చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా శిబిరం నిర్వహణ గురించి విద్యార్థులకు పలు సూచనలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ చైర్మన్ రవికుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దేవరకొండ దర్గా ముతావలీలు

దేవరకొండ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణంలో వక్ఫ్ బోర్డు భూముల్లో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని దేవరకొండ సయ్యద్ హజ్రత్ సులేమాన్ ఖాద్రి దర్గా ముతావలీలు డిమాండ్ చేశారు. నల్లగొండలో సోమవారం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని 753, 405 సర్వేనెంబర్లలోని వక్ఫ్ బోర్డు భూముల్లో కొంతమంది అక్రమ నిర్మాణాలు చేపడుతూ కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. మునిసిపల్, రెవెన్యూ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. వక్ఫ్ బోర్డు భూములను సర్వే చేసి ఆక్రమించుకున్న వారిపై చర్య తీసుకోవాలని కోరారు. వినతిపత్రంలో అందజేసిన వారిలో కోరినట్లు ముతవలులు సిద్ధిక్, ఫజల్, ఖాజాపాషా, సయ్యద్ అలీ, ఉస్మాన్‌అలీ తదితరులు ఉన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి



పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో ఖతిజాబేగం

కొండమల్లేపల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని సీడీపీవో ఖతిజాబేగం అన్నారు. పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా సోమవారం కొండమల్లేపల్లి ప్రాజెక్టు పరిధిలోని కోల్‌ముంతలపహాడ్ రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పోషకాహారంపై అవగాహన కల్పించారు. పోషకాహార లోపం తగ్గించడానికి చిరుధాన్యాలు తీసుకోవాలని, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో నాగేశ్వర్‌రావు, ఎంవో ఉషారాణి, ఏపీఎం యాదయ్య, సూపర్‌వైజర్ సువర్ణ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఆకుకూరలతో మెరుగైన ఆరోగ్యం

హాలియా: ఆకుకూరలతో ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని అనుముల మండలం చల్మారెడ్డిగూడెం జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం ప్రకాష్ అన్నారు. పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం పాఠశాలలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సరిత అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆరోగ్యమే మహాభాగ్యమని ఆరోగ్యాన్ని అందరూ కాపాడుకోవాలన్నారు. ఆకుకూరలు, తృణధాన్యాలు, వాడుతూ ప్రకృతిలో లభించే సీజనల్ పండ్లను తింటూ విద్యార్థులు ఇప్పటి నుంచే వారి యొక్క ఆరోగ్యానికి బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. అనంతరం వివిధ రకాల పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, తృణధాన్యాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శ్రీదేవి, విజయ, శ్రీదేవి, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



హాలియాలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు ప్రకాష్

హాలియాలోని జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమాదేవి కిశోర బాలికలు తీసుకోవాల్సిన పోషకాహారం, పరిశుభ్రత, రక్తహీనత రావడానికి గల కారణాలు వివరించారు. రక్తహీనత లేకుండా రోజు ఐరన్ సంబంధించిన ఆహార పదార్థాలు తీసుకోవాలని, అలాగే పరిశుభ్రత పాటించాలని సూచించారు. 18 సంవత్సరాలలోపు బాల్య వివాహాలు చేసుకోరాదని, అక్రమ రవాణా పొక్సో చట్టం గురించి వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమాదేవి, స్కూల్ హెచ్ఎం వెంకట్‌రాంరెడ్డి, ఉపాధ్యాయులు మాధి, ముజీబ్, కల్పలత, అంగన్‌వాడీ టీచర్లు వజ్రమ్మ, విజయలక్ష్మి, నర్మద, పుష్ప కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు మానుకోవాలి



వీరబోయిన ఎల్లయ్య సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుకున్న కార్యకర్తలు

పెద్దఅడిశర్లపల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు మానుకోవాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వీరబోయిన ఎల్లయ్య అన్నారు. గుడిపల్లి మండలంలోని ఘనపురం గ్రామంలో ఆదివారం బీఆర్ఎస్‌లో చేరిన 50 కుటుంబాలు సోమవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరబోయిన ఎల్లయ్య సమక్షంలో తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది బీఆర్ఎస్ మాజీ నాయకులు వారి స్వలాభం కోసం ఎమ్మెల్యే బాలునాయక్ గెలిచిన వెంటనే కాంగ్రెస్ పార్టీలో చేరారని అన్నారు. ప్రభుత్వ పథకాలు లబ్ధిపొందిన తర్వాత కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేయడంతో పాటు కాంగ్రెస్ కార్యకర్తలకు బలవంతంగా బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పించారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసే అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నెర్మటి సతీష్‌రెడ్డి, కుక్కల గోవర్ధన్‌రెడ్డి, ముచ్చర్ల ఏడుకొండలు యాదవ్, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ముచ్చర్ల శ్రీకాంత్, బోల్లు గోవింద్‌యాదవ్, తోటకూరి సత్తయ్య, షైనం సంధ్యజానయ్య, ఖాజామియా, నాగిరెడ్డి, వినోద్, వెంకన్న, జగాల్‌రెడ్డి, రెడ్డిమల్ల రవి, రెడ్డిమల్ల శ్రీను, బౌరయ్య, సత్తయ్య, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్ ప్రభుత్వం



పార్టీలో చేరిన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పాశం గోపాల్‌రెడ్డి

గుర్రంపోడు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందని, అమలు కాని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పాశం గోపాల్‌రెడ్డి అన్నారు. గుర్రంపోడు మండలంలోని శాకాజిపురం గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు సోమవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గ్రామానికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ డైరక్టర్ గంగుల ఓం కారం, పేర్ల వెంకట్‌రెడ్డి, అందుగుల లింగయ్య కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పాశం గోపాల్‌రెడ్డి సమక్షం లో పార్టీలో చేరారు. వారికి ఆయన గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలో జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలతో పాటు అత్యధిక సర్పంచ్ స్థానాలను గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కూనూరు సైదిరెడ్డి, బిక్షం, ఇస్తారు, పేర్ల జైపాల్‌రెడ్డి, బోడ సురేష్, చిర్రబోయిన వెంకటయ్య, అందుగుల వెంకటయ్య, సన్నాల వెంకటయ్య, అమరావతి రమేష్, అందుగుల పెద్ద వెంకటయ్య, గిరి సత్తయ్య, ఆరపల్లి శ్రీశైలం, ఆరపల్లి చిన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు మాడ్గులపల్లిలో పశు వైద్యశిబిరం

మాడ్గులపల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండల పశు వైద్యశాల, పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో మంగళవారం ప్రత్యేక వైద్యశిబిరం, గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ పశువైద్య శిబిరంలో గర్భకోశ వ్యాధులు ఉన్న పశువులకు ప్రత్యేక చికిత్స చేసి మందులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రతీ పశువును పరిశీలించి ఆరోగ్య సమస్య ఉంటే చికిత్స అందిస్తామని, దూడలకు, పశువులకు నట్టల నివారణ మందులు అందిస్తామని అన్నారు. ఆవులు, గేదెల్లో చూడి పరీక్ష లు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కావున పాడి రైతులు, పశుపోషకులు తమ పశువులను పశువైద్య శాలకు తీసుకొచ్చి వైద్యసేవలను వినియోగించుకోవాలని కోరారు.

నేత్రదానం మహాదానం

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): నేత్రదానం మహాదానమని వాసవీ క్లబ్ అర్గాన్ డొనేషన్ ఇంటర్నేషనల్ చైర్మన్ మిట్టపల్లి విజయభాస్కర్ అన్నారు. పట్టణానికి చెందిన నీలా పాండురంగయ్య మృతి చెందగా, కుటుంబ సభ్యుల అంగీకారంతో డైమండ్ నేత్రనిధి సంస్థ ఆధ్వర్యంలో రెటీనాను సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దురదృష్టవశాత్తూ మృతి చెందిన వారి నేత్రాలు దానం చేస్తే ఇద్దరు అంధులకు చూపు అందించవచ్చని అన్నారు. రక్త, నేత్ర, అవయవదానాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో సామా శ్రీనివాస్, మంచుకొండ వెంకటేశ్వర్లు, ఊటుకూరి శ్రీనివాస్, చంద్రశేఖర్, కృష్ణయ్య, రమేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక దృఢత్వం అవసరం

మిర్యాలగూడటౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మానసిక దృఢత్వం అవసరమని ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ పోకల వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని విజేత డిగ్రీ కళాశాలలో మానసిక ఆరోగ్యంపై నిర్వహించిన అవగాహన శిబిరానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నిరాశ, నిస్పృహలకు లోనుకావద్దని, ఆత్మవిశ్వాసం పెంపొందించుకుని ముందుకు సాగాలన్నారు. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మెడిటేషన్, యోగా సాధన చేయాలని సూచించారు. సెల్‌ఫోన్లతో కాలక్షేపం చేయరాదని, ఎనిమిది గంటల నిద్ర ఉండేలా దినచర్య ఉండాలన్నారు. క్రమశిక్షణ అలవర్చుకుని జీవితాన్ని సన్మార్గంలో నడిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ధనుంజయ్, మధు, బాలకృష్ణ, యాదగిరి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మద్యంపై ఎమ్మెల్యే సమరం

(5వ పేజీ తరువాయి)

మండలంలో మూడు, మునుగోడు, చండూరు మండలాల్లో నాలుగు చొప్పున, మర్రిగూడ, నాంపల్లి మండలాల్లో మూడు చొప్పున, గట్టుప్పల్‌లో ఒక మద్యం దుకాణం కలిపి మొత్తం 29 ఉన్నాయి.

ఏడాదిన్నర నుంచి బెల్ట్ దుకాణాల నిర్మూలనకు యత్నాలు

నియోజకవర్గంలో విచ్చలవిడిగా మద్యం వినియోగాన్ని తగ్గించడమే లక్ష్యంగా కార్యాచరణ మొదలుపెట్టిన ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఏడాదిన్నర క్రితం 2024 మే నెల నుంచి బెల్ట్ దుకాణాల నిర్మూలన కార్యక్రమం చేపట్టారు. ఒక సందర్భంలో ఆయన సైతం ఉదయం 10 గంటలకే మునుగోడులోని ఒక సిట్టింగ్ వద్దకు వచ్చి ఉదయాన్నే మద్యం తాగడానికి వచ్చిన యువకుడిని గుర్తించి కౌన్సిలింగ్ ఇచ్చారు. నియోజకవర్గంలో విచ్చలవిడిగా ఒక్కో గ్రామంలో 10 నుంచి 15 వరకు ఉన్న బెల్ట్‌షాపులన్నింటినీ ఎత్తివేయించారు. విస్తృత స్థాయిలో పోలీసులతో దాడులు చేయించడంతో కొన్ని నెలల పాటు బెల్ట్‌దుకాణాల నిర్వహణ నిలిచింది. పోలీస్ దాడులే తప్ప ఎక్సైజ్‌శాఖ నుంచి వీటి నిర్మూలనకు పూర్తిస్థాయిలో చర్యలు లేకపోవడంతో ఐదారు నెలల తర్వాత మళ్లీ పండుగలు, జాతరలు, పార్టీల పేరుతో మెల్లగా కొన్నికొన్ని గ్రామాల్లో బెల్ట్ దుకాణాలు మొదలయ్యాయి. అయితే గతంలో మాదిరిగా విచ్చలవిడిగా కాకపోయినా విక్రయాలు మాత్రం కొనసాగుతున్నాయి. అయితే నేరుగా దుకాణాలు నడపకుండా మొబైల్ పద్ధతిలో, అవుట్‌డోర్ డెలివరీ పద్ధతిలో బెల్ట్‌దుకాణాల నిర్వాహకులు మద్యం విక్రయిస్తున్నారని ఆయా గ్రామస్థులు చెబుతున్నారు. పోలీసులకు సైతం దొరకకుండా పొలాల వద్ద, బావుల వద్ద ఏ రోజుకారోజు మద్యం నిల్వచేసి అడిగిన మద్యంపై క్వార్టర్‌కు రూ.40 అదనంగా తీసుకొని డోర్‌డెలివరీ లేదా అవుట్‌డోర్ డెలివరీ చేస్తున్నారని చెబుతున్నారు. ఎమ్మెల్యే సీరియస్‌గా బెల్ట్‌షాపుల నిర్మూలనపై హెచ్చరిస్తున్నా గ్రామాల్లో ఈ పరిస్థితి కొనసాగుతోందని అంటున్నారు. కేవలం పోలీసులే కాకుండా ఎక్సైజ్‌శాఖ సిబ్బంది సైతం మద్యం దుకాణాల్లో తప్ప బయట విక్రయించకుండా కట్టడి చేస్తే బెల్ట్‌దుకాణాల నిర్మూలన, మద్యం వినియోగం తగ్గుతుందని, ఈ దిశగా చర్యలకు ఎమ్మెల్యే ప్రతిపాదించాలని నియోజకవర్గ ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.